నేటి కందం- నేటికి అందం

నేరుగ "తొలిముద్ద"ను చి
న్నారుల కందించ నొక్క నవ పథకంబున్
తీరుగ రాష్ట్ర ప్రభుత్వము
ప్రారంభము చేసినది తెలంగాణములోన్ !!

(చిన్నారులకు పౌష్టికాహారం అందించ దానికి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం "తొలిముద్ద" పథకాన్ని ప్రవేశపెట్టింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

సకలజనం నోట
శాంతిపూల తోట
నియంతలు ఇంకెలా
నేడు యుద్ధ బాట
నో కింగ్ ఉద్యమం
నేడు జరిగే విశ్వం
ఆగేనా విధ్వంసక
ఆధిపత్య అశ్వం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 31-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:179 పేజీలు:6 వెల: రూ.1/-

## అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఆపాలంటూ అసెంబ్లీలో తీర్మానం..



హైదరాబాద్, మార్చి 30:అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఆపేలా కేంద్రం చొరవ చూపాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. మధ్యప్రాచ్యంలో యుద్ధం వల్ల దాదాపు 4 వేల మంది మరణించారని ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావం ఆసియా దేశాలపై తీవ్రంగా పడుతోందని.. ఆర్థిక విధ్వంసం జరుగుతోందని తెలిపారు.

యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉందని భట్టి పేర్కొన్నారు.

ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఆగకపోతే ప్రపంచ దేశాల భవిష్యత్తు మరింత ఆందోళనకరంగా మారొచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఇప్పుడు ఆగకపోతే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఖండిస్తున్నామని.. ఆయా దేశాల మధ్య శాంతి పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. యుద్ధాన్ని ఆపే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నం చేయాలని తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు భట్టి విక్రమార్క.

## అన్నదాతలకు గుడ్ న్యూస్.. గడ్డి మందుని నిషేధిస్తూ తీర్మానం..

హైదరాబాద్, మార్చి 30:తెలంగాణలో పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)ని నిషేధించాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వం రావు ప్రవేశపెట్టారు. రైతులు వ్యవసాయానికి వాడుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ ప్రమాదకరంగా మారిందని.. అందుకే తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు సభ్యులకు మంత్రి వివరించారు. ఇది ప్రాణాంతక రసాయనమని.. దీన్ని అనేక దేశాల్లో నిషేధించారని తెలిపారు

పారాక్వాట్ డైక్లోరైడ్ వాడడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలతో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వాడి అనేక మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. సుస్థిర సేంద్రీయ వ్యవసాయ లక్ష్యాలకు ఇది అడ్డుగా మారిందని.. దీని తయారీ, వాడకం, రవాణా, దిగుమతి ఇలా అన్ని విధాలుగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గడ్డి మందుని నిషేధించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేశారు.

## కేసీఆర్ వల్లే నాకు గుర్తింపు వచ్చింది: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 30: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై మాట్లాడారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు.

### ఎంపీ లక్ష్మణ్ రాజీనామా చేయాలి..!

దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు రేవంత్ రెడ్డి. రాజకీయంగా అవసరం ఉన్నప్పుడే సౌత్ ఇండియాను పట్టించుకోవడం లేదని.. ఇక నియోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు.

### రాజకీయ పార్టీల సమస్య కాదు..

ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవు పలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.

### త్వరలో క్యాన్సర్ పరీక్షలు..

రాష్ట్ర ప్రజలందరికీ త్వరలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని భరోసా కల్పించారు రేవంత్ రెడ్డి. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.



### పోలికే లేదు..!

తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు రేవంత్. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు రేవంత్ రెడ్డి.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలి ఎమ్మెల్సీ విజయశాంతి



హైదరాబాద్, మార్చి 30: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విజ&జప్తి చేశారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ విజయ శాంతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిపోయినా.. ఇంకా ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు సైతం అమలు కాలేదన్నారు. ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి గుర్తు చేశారు. ఆయా కుటుంబాలకు నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ సైతం ఇచ్చామని ప్రభుత్వానికి వివరించారు.

ఉద్యమకారులకు మనం తొలి ప్రాధాన్యం (ఫస్ట్ ప్రయారిటీ) ఇస్తామని భరోసా కూడా ఇచ్చామని ఎమ్మెల్సీ విజయశాంతి తెలిపారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఉద్యమకారులు తమను ప్రశ్నిస్తున్నారని శాసనమండలి వేదికగా ఎమ్మెల్సీ విజయశాంతి వివరించారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తి వేసి జూన్ 2వ తేదీ నాటికి వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చామని.. అది కూడా ఇంకా నెరవేరలేదని విజయశాంతి చెప్పారు.

ఉద్యమకారులు లేకపోతే నీ ఎంలు, మంత్రులు ఉండేవారా? అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఆ బాధ్యతను కాంగ్రెస్ నెరవేరిస్తే మరో చరిత్ర అవుతుందని.. పట్టించుకోకుంటే చారిత్రక తప్పిదం అవుతుందని విజయశాంతి పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఎమ్మెల్సీ విజయశాంతి సూచించారు.

## దారుణం.. మద్యంమత్తులో విద్యార్థులపై రెచ్చిపోయిన హాస్టల్ ఉద్యోగి..

జగిత్యాల, మార్చి 30: జిల్లా కేంద్రంలోని ఎస్టీ గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. హాస్టల్ ఉద్యోగి కామాటి శ్రీనివాస్ ప్రతి రోజూ మద్యంమత్తులో విధులకు హాజరవుతూ విద్యార్థులను చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. తాగిన మత్తులో బాలురను తిడుతూ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నాడు. చీపురు తీసుకుని మరీ విద్యార్థులపై దాడి చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడు. అతని వేధింపులు భరించలేక వీడియో తీసిన చిన్నారులు సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

ఈ వీడియో వైరల్ కావడంతో విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. ప్రభుత్వ సహకారంతో పేద విద్యార్థులు చదువుకుందామని హాస్టళ్లలో చేరుతుంటే.. ఇలా వేధింపులకు పాల్పడడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు ఘటనపై వెంటనే స్పందించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, తాళ్ల ధర్మారం నుంచి జగిత్యాలకు డిప్యుటేషన్‌పై కామాటి శ్రీనివాస్ వచ్చారు.

నల్లగొండ జిల్లా దామరచర్ల బీసీ గురుకులంలోనూ ఇలాంటి ఘటనే మరొకటి చోటు చేసుకుంది. పాఠశాలలో 8, 9 విద్యార్థినిలను మోకాళ్లపై కూర్చొపెట్టి వేధించారు ప్రిన్సిపాల్. భోజనం సరిపోక అందరికీ పెట్టిన తర్వాత మిగిలిన అన్నం తిన్నందుకు విద్యార్థినులందరినీ దాదాపు రెండు గంటలపాటు మోకాళ్లపైనే కూర్చోపెట్టారు. ఎవరు తిన్నారో నిజం చెప్పకపోతే అందరికీ శిక్ష తప్పదని హెచ్చరించారు ప్రిన్సిపాల్. విషయం బయటికి చెబితే టీసీ ఇస్తానని బెదిరింపులకు దిగారు. దీనికి సంబంధించిన వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వరుస ఘటనలతో పేద విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.

## బస్తర్‌లో ప్రస్తుతం మావోలు లేరు...

న్యూఢిల్లీ, మార్చి 30:నక్సలిజం నిర్మూలనపై లోక్‌సభలో చర్చ మె?దలైంది. మావోయిస్టులపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్టేట్‌మెంట్ ఇచ్చారు. మావోయిస్టుల ఏరివేతకు రేపే(మార్చి 31) డెడ్ లైన్ అని తెలిపారు. బస్తర్‌లో ప్రస్తుతం మావోలు లేరని.. మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వెల్లడించారు. బస్తర్‌లో ఆదివాసీలకు ప్రస్తుతం అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అభివృద్ధి దిశగా బస్తర్ ప్రాంతం ముందుకెళ్తోందని తెలిపారు.

మావోల లొంగుబాటుకు రేపే(మంగళవారం) ఆఖరి తేదీ అని.. అభివృద్ధి లేదంటూ ఆయుధాలు పట్టుకోవడం సరికాదని హితవుపలికారు అమిత్ షా. ఆయుధాలు వీడని వారి అంతు చూస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో విలీన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని.. కాంగ్రెస్ పాలనలోనే గిరిజన ప్రాంతాలు ఎందుకు అభివృద్ధి చెందలేదని ప్రశ్నించారు. వారి పాలనలో బస్తర్ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని.. గిరిజనులను 60 ఏళ్లపాటు కాంగ్రెస్ విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లే దేశంలో మావోయిజం పెరిగిందని కేంద్ర హోంమంత్రి ఆరోపించారు.




మావోయిజం వల్ల 12 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని అమిత్ షా ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని.. తమ వల్లే నక్సల్స్ విముక్త భారత్ సాధ్యమవుతోందని లోక్‌సభ వేదికగా కేంద్ర మంత్రి ప్రకటించారు.

## తిరుమలలో వేడుకగా శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు ప్రారంభం



తిరుపతి, మార్చి 30: తిరుమల లోని వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభవయ్యాయి. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామి వారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడిందని అర్చకులు తెలిపారు.

ఎండ వేడి నుంచి స్వామివారు ఉపశమనం పొందేందుకు జరిపే ఉత్సవం కావడంతో దీన్ని ఉపశమనోత్సవం అని కూడా అంటారని వివరించారు. ఈ ఉత్సవంలో సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతోపాటు పలురకాల మధురఫలాలను స్వామివారికి నివేదించారు. ఈ వేడుకల కోసం వట్టివేరుతో ఆకర్షణీయంగా మండపాన్ని రూపొందించారు.

వానరులు, ఏనుగులు, సింహాలు, పులులు, నెమళ్ళు, పాముల తదితర జంతువులు, పలురకాల చెట్ల ప్రతిరూపాలతో శేషాచల అడవిని తలపించేలా ఈ మండపాన్ని తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వార్లను నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వసంత మండపానికి తీసుకువచ్చారు.

వసం తోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం శ్రీ భూ సమేత మలయ ప్పస్వా మివారికి స్నపనతిరుమంజనం శోభాయమానంగా జరిగింది.

## గంజాయి కేసులో యువకుడిపై పీడీ యాక్ట్

ఖమ్మం, మార్చి 30: గంజాయి కేసులో నిందితుడిగా ఉన్న సారపాకకు చెందిన షేక్ మున్వర్‌పై బూర్గంపహాడ్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. పాల్వంచ సీఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సారపాకకు చెందిన షేక్ మున్వర్ 2024, 2025 సంవత్సరాల్లో బూర్గంపహాడ్ పోలీసుస్టేషన్‌లో రెండు, 2024లో లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్‌లో ఒకటి, 2024లో ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్ లో ఒకటి చొప్పున గంజాయి అక్రమంగా రవాణా చేసినందుకు కేసులు నమోదయ్యాయి. చివరి గా 2025 ఏప్రిల్‌లో దుండిగల్ పోలీసుస్టేషన్‌లో 98 కిలోల గంజాయిని సరఫరా చేస్తూ దొరకగా అక్కడ కూడా కేసు నమోదు అయ్యాయి. ఈ ఐదు కేసుల్లో షేక్ మున్వర్ మొత్తం 287 కిలోల గంజాయిని సరఫరా చేస్తూ అక్రమార్జనకు పాల్పడటంతో పీఐటీ ఎన్డీపీఎస్ యాక్ట్ కోసం పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీశ్‌కుమార్ సూచనతో పాల్వంచ సీఐ కె.సతీశ్ ప్రతిపాదించగా జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షణలో ప్రతిపాదిత ఆధారాలు క్షుణ్ణంగా పరిశీలించి సీఐడి అడిషనల్ డీజీపీ చారుసిన్హా గత ఫిబ్రవరి 16న డిటెన్షన్ ఆర్డర్(నిర్బంధ ఉత్తర్వులు)ను జారీ చేసి 18న ఆ ఆర్డర్ ప్రతులను షేక్ మున్వర్‌కు అందించి చర్లపల్లి సెంట్రల్ జైల్‌కు ఆయన్ను తరలించినట్లు సీఐ తెలిపారు.

మార్చి 17న అడ్వైజరీ బోర్డు (సలహా మండలి) షేక్ మున్వర్‌పై వచ్చిన నిర్బంధ ఉత్తర్వులపై విచారణ జరిపి భౌతిక, సాంకేతిక ఆధారాలను పరిశీలించి పీడీ యాక్టు -సమర్ధిస్తూ ఏడాది కాలం చర్లపల్లి జైలులో నిర్బంధించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

## ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ : ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన



నల్గొండ, మార్చి 30: ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, అయితే ఆ దిశగా నూతన పరిశోధనలపై దృష్టి సారించడంతో పాటు సబ్జెక్టుపై పట్టు సాధించాలని ఎంజీయూ వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూ సైన్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వర్సిటీలోని ఆ కళాశాల సెమినార్ హాల్‌లో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ- 2028' అనే అంశంపై నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రసాయన శాస్త్ర విభాగంలో ఉన్నఆధునిక ప్రయోగ శాలలు, గ్రంథాలయ సదుపాయాలను విద్యార్థులు సమర్ధవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఎంజీయూలో అత్యాధునిక ల్యాబోరేటిస్ అందుబాటులో ఉంచి విద్యనందిస్తున్నట్లు తెలిపారు.వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వసంత మాట్లాడుతూ.. సదస్సు లక్ష్యాలు, ఇతర అంశాలపై వివరించారు. కెమిస్ట్రీ విభాగం హెచ్ఓడీ డా.ఎం.జ్యోతి 'విద్యా, పరిశోధన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ముఖ్య వక్త ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ.అ హ్మద్ కమాల్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొ.డి. రామాచారి తదితరులు వివిధ అంశాలపై అవగాహన కల్పించా రు. సదస్సులో కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్స్ డా.వై.ప్ర శాంతి, డా.దోమల రమేశ్, డా.ఆర్.రూపా, డా.ఎస్. కళ్యాణి, డా.ఏ.శ్రీధర్ రావు, తిరుపతయ్య. డా.జె. శంకరాచారి, డా.కె.అమ రేందర్, అధ్యాపకులు పరిమళ, మహతి, ఆయేషా బేగం పాల్గొన్నారు.

## ఏప్రిల్ 4న ఎంజీయూలో మెగా జాబ్ మేళా

నల్గొండ, మార్చి 30:నల్లగొండలోని మహాత్మ గాంధీ యూనిర్సిటీలో చదివే విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకే మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఎంజీయూలో వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4న నిర్వహించే 'మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డా.హరీశ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళాలో ఐటీ, ఫార్మా, అగ్రికల్చర్, బ్యాంకింగ్ వంటి విభిన్న రంగాలకు చెందిన 15 ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నట్లు, సుమారుగా ఆయా సంస్థలో 1,500 ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంజీయూలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభం అవుతుందని తెలిపారు. యూనివర్సిటీ పరిదిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సులు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో పాటు ఇప్పటికే కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకావచ్చని వెల్లడించారు. పూర్తి వివరాలకు ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్‌లో 7095922360, 9989260671, 950277 1776, 96426 76777, సంప్రదించాలని ఆయన వెల్లడించారు. పోస్టర్ ఆవిష్కరణలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.కొప్పుల అంజిరెడ్డి, వివిధ విభాగాల అధికారులు ప్రొ.రేఖ, డా.శ్రీదేవి, డా.మిర్యాల రమేశ్ కుమార్, డా.నీలకంఠం శేఖర్ పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీల వ్యథలు పట్టవా !

## (31 మార్చి "జాతీయ వ్యవసాయ కార్మికుల దినోత్సవం" సందర్భంగా)

భారతీయ నాగరికతకు వ్యవసాయంతో విడదీయరాని సంబంధం అన్నది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక రైతన్న. అన్నదాత నాగలి సాగితేనే మన కంచంలో ముద్ద ప్రత్యక్షం అవుతుంది. కార్షకుడి చేమట తేమతో పంటలు పండుతున్నాయి. రైతన్న సాగుబడికి వ్యవసాయ కూలీలు కూడా తోడ్పడుతున్నారు. కలుపు తీయడం, నాట్లు వేయడం, పురుగు మందులు స్ప్రే చేయడం, కోతలు కోయడం, దుక్కి దున్నడం, విత్తనాలు వేయడం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా లాంటి పలు పనులకు వ్యవసాయ కార్మికులు పునాదిగా నిలుస్తున్నారు. వ్యవసాయ భూమి యజమాని లేదా కౌలుదారుడు కర్షకుడిగా పలువబడుతూ నిత్యం శ్రమిస్తున్నాడు. వ్యవసాయ పనులకు రైతు వినియోగించుకునే మానవ వనరులను వ్యవసాయ కార్మికులు/కూలీలుగా పరిగణించాలి. వ్యవసాయ క్షేత్రంలో పని చేసే వ్యక్తులను వ్యవసాయ కూలీలు లేదా వ్యవసాయ కార్మికులుగా పిలుస్తున్నాం. భూమి యజమాని ఆదాయం, పంట పెట్టుబడులు, లాభ నష్టాలతో వ్యవసాయ కూలీలకు సంబంధం ఉండదు.

జాతీయ వ్యవసాయ కార్మికులు/కూలీల దినోత్సవం:

రైతు కూలీల సమస్యలను అవగాహన చేసుకోవడం, ఆ వర్గాలకు మేలు కలిగే చర్యలు తీసుకోవడం లాంటి అంశాల చర్చలకు వేదికగా "జాతీయ వ్యవసాయ కూలీల/కార్మికపు దినోత్సవం (నేషనల్ ఫార్మ్ వర్కర్స్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రతి ఏటా 23 డిసెంబర్ రోజున మన దేశంలో "జాతీయ రైతు దినోత్సవం" పాటిస్తున్నామని గమనించండి. 2014లో యూఎస్‌లో ప్రారంభమైన జాతీయ వ్యవసాయ కార్మికపు దినోత్సవం నేడు ప్రపంచవ్యాప్తంగా పాటించడం అత్యవసరంగా తోస్తున్నది. పలు అధ్యయనాల ప్రకారం భారతదేశంలో దాదాపు 600 మిలియన్ల రైతులు, వ్యవసాయ కూలీలు దేశానికి ఆహార ధాన్యాలను పండిస్తున్నారు. భారత దేశ కార్మికుల్లో 46 శాతం వరకు వ్యవసాయ కూలీలుగా శ్రమిస్తున్నారు. దాదాపు 70 మిలియన్ల రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాలు ఉన్నాయి.

వ్యవసాయ కూలీల సమస్యలు అనేకం:

వ్యవసాయ కార్మికులు లేనిదే సాగుబడి జరగదు. వ్యవసాయ కూలీల వ్యథలు వర్ణనాతీతం. వ్యవసాయ కూలీల్లో మహిళల ప్రాధాన్యం ఎక్కువ. భారతంలో యూపీ, ఎంపీ, హర్యానా, తెలంగాణ, రాజస్థాన్, ఏపీల్లో వ్యవసాయదారులు లేదా రైతులు అత్యధికంగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అసంఘటిత రంగంలో ఉన్న వ్యవసాయ కూలీ ప్రధాన సమస్యల్లో స్వల్ప వేతనాలు, పని కొరత, ఆరోగ్య సమస్యలు, వాతావరణ ప్రతికూల మార్పుల ప్రభావం, నిలకడలేని ఉపాధులు, అప్పుల కుప్పల భారం, బాల కార్మిక దురాచారం, కూలీల కొరత, సాంకేతిక మార్పులు, వేతనాల అసమానతలు, ఆర్థిక సామాజిక సమస్యలు, అధ్వాన్నమైన పని పని పరిస్థితులు, మానవ హక్కుల హననాలు, అణచివేతలు, చట్ట రక్షణలో లోపాలు లాంటివి ఆ వర్గాన్ని కుంగదీస్తున్నాయి.

వ్యవసాయ కూలీల సమస్యలకు పరిష్కారాలు:

వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వాలు, పౌర సమాజం, రైతులు, భూమి యజమాన్యాలు ముందుకు రావాలి. కనీస వేతన చట్టానికి అనుగుణంగా పని కల్పించాలి. కూలీలకు పని క్షేత్రంలో భద్రత కల్పించాలి. ఉచిత ఆరోగ్య వసతులు కల్పించాలి. అన్ని సీజన్లలో పని కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి. కూలీల కుటుంబ పిల్లలకు ఉచిత విద్య అందించాలి. పనికి తగిన ప్రతిఫలం దక్కే విధంగా చూడాలి. పురుగు మందుల పిచికారిలో తగిన జాగ్రత్తలు పాటించే విధంగా చూడాలి. కూలీలు దుఃఖిస్తే మహాపాపం. ప్రతి ఒక్కరు వ్యవసాయ కూలీలకు తగిన గుర్తింపు ఇవ్వాలి. రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాలు సంతోషంగా ఉంటేనే సరసమైన ధరలకు ఆహార పదార్థాలు మన చేతికి అందుతాయని గమనించాలి.

వ్యవసాయ కార్మికుల శ్రేయస్సు మన ప్రధాన నినాదం కావాలి. అన్నదాత రోదనలు దేశానికి పెనుశాపాలు. రైతు లేని భారతం ఎడారితో సమానం. అన్నదాత/సాగుకూలీల ఆక్రందనాలు దేశాభివృద్ధికి విఘాతాలు. సాగుబడి సదుగులు ఇరిగితే అన్నం మెతుకు కొరత కేకలు మిన్నంటుతాయి. రైతు కూలీలు సుభిక్షంగా ఉంటే భరతమాత ఆనంద డోలికల్లో మునిగి తేలుతుంది. హలధారి ముఖం నవ్వులతో వికసించాలి. రైతే రాజు కావాలి. వ్యవసాయ కూలీలు మన ప్రియ నేస్తాలు కావాలి.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# మహావీర్ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని కోబా తీర్థంలో సామ్రాట్ సంప్రతి మ్యూజియాన్ని ప్రారంభించనున్న పీఎం

న్యూఢిల్లీ, మార్చి 30:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్చి 31, 2026న గుజరాత్‌లో పర్యటించనున్నారు. ఉదయం సుమారు 10 గంటలకు గాంధీనగర్‌లో సామ్రాట్ సంప్రతి మ్యూజియాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తారు. మధ్యాహ్నం సుమారు 12:45 గంటలకు అహ్మదాబాద్‌లోని సనంద్‌లో కేన్స్ సెమికాన్ ప్లాంట్‌ను ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడతారు. ఆ తర్వాత వావ్-థరాడ్‌లో సాయంత్రం సుమారు 4 గంటలకు రూ. 20,000 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసి, వాటిని జాతికి అంకితం చేస్తారు. అనంతరం అక్కడ కూడా ప్రధానమంత్రి ప్రసంగించనున్నారు.

మహావీర్ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని కోబా తీర్థంలో సామ్రాట్ సంప్రతి మ్యూజియాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. అశోక చక్రవర్తి మనవడు, జైన సంప్రదాయంలో అత్యంత గౌరవనీయుడైన సామ్రాట్ సంప్రతి పేరు మీదుగా ఈ మ్యూజియానికి నామకరణం చేశారు. అహింసా మార్గాన్ని అనుసరిస్తూ జైన మత వ్యాప్తికి ఆయన కృషి చేశారు. జైన మత గొప్ప చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ మ్యూజియం ప్రపంచానికి చాటి చెబుతుంది.

మహావీర్ జైన్ ఆరాధన కేంద్రం ప్రాంగణంలోని ఈ మ్యూజియం.. భారత నాగరికత, సంప్రదాయాల్లోని విశిష్ట అంశాలకు అంకితం చేసిన ఏడు ప్రత్యేక విభాగాలతో ఉంది. ఇది సందర్శకులకు శతాబ్దాల కాలం నాటి జ్ఞానం, వారసత్వాల సమగ్ర సమాచారాన్ని అందిస్తుంది. ఇక్కడి సంప్రదాయ ప్రదర్శనలతో పాటు ఆధునిక డిజిటల్, ఆడియో-విజువల్ సౌకర్యాలు సందర్శకులకు, పరిశోధకులకు, పండితులకు తన్మయత్వంతో కూడిన, ఆకర్షణీయమైన అనుభూతిని కలిగిస్తాయి.

అత్యంత నైపుణ్యంతో చెక్కిన రాతి, లోహ విగ్రహాలు, భారీ తీర్థ పట్టా, యంత్ర పట్టా, సూక్ష్మ చిత్రలేఖనాలు, వెండి రథాలు, నాణేలు, పురాతన రాతప్రతుల వంటివి ఏడు భారీ గ్యాలరీల్లో కొలువుదీరాయి. రెండు వేలకుపైగా అరుదైన నిధులను విశాలమైన హాలులో ప్రదర్శించటం ద్వారా జైనమత పరిణామ క్రమాన్ని, దాని లోతైన సాంస్కృతిక ప్రభావాన్ని కాలక్రమానుసారంగా అర్థం చేసుకునేందుకు సందర్శకులకు ఈ మ్యూజియం తోడ్పడుతుంది.

సనంద్‌లో పీఎం

అహ్మదాబాద్‌లోని సనంద్ జీఐడీసీలో కేన్స్ సెమికాన్ ప్లాంట్‌ను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ఇది ఈ యూనిట్‌లో వాణిజ్యపరమైన ఉత్పత్తిని ప్రారంభించటమే కాక, భారత సెమీ కండక్టర్ రంగ ప్రయాణంలో కీలక ఘట్టంగా నిలవనుంది.

అడ్వాన్స్‌డ్ ఇంటెలిజెంట్ పవర్ మాడ్యూల్స్ (ఐపీఎంఎస్) తయారీతో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఆటోమోటివ్, పారిశ్రామిక అవసరాలకు అవసరమైన చిన్న, సమర్థవంతమైన, విశ్వసనీయ పవర్ స్విచ్చింగ్ సిస్టమ్స్‌లో ఇవి అత్యంత కీలకమైన భాగాలు. ఒక్కో మాడ్యూల్‌లో ఉండే 17 చిప్స్‌ను కాలిఫోర్నియాకు చెందిన ఆల్ఫా అండ్ ఒమేగా సెమీ కండక్టర్ (ఏఓఎస్) సంస్థకు సరఫరా చేస్తారు. ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యాక రోజుకు 6.33 మిలియన్ల యూనిట్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం దీనికి ఉంటుంది.

ఇండియా సెమీ కండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)లో భాగంగా కేన్స్ సెమికాన్ ప్లాంట్ ప్రారంభోత్సవం కీలక ముందడుగు. ఈ పథకం ద్వారా ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో, మైక్రాన్ టెక్నాలజీ తర్వాత వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించనున్న రెండో సెమీ కండక్టర్ కేంద్రం ఇదే అవుతుంది.

భారతదేశంలో ఉత్పత్తి దశలోకి అడుగుపెడుతున్న రెండో ఓఎస్ఏటీ/ఏటీఎంపీ (అవుట్‌సోర్స్ సెమికండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ / అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకింగ్) యూనిట్‌గా నిలవటమే ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. భారత సంతతికి చెందిన ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సర్వీసెస్ (ఈఎంఎస్) సంస్థ సెమీ కండక్టర్ తయారీ రంగంలోకి రావటాన్ని ఇది సూచిస్తుంది. తద్వారా దేశీయ ఉత్పాదక సామర్థ్యం బలోపేతం అవుతుంది

భారత సెమీ కండక్టర్ తయారీ రంగంలో లోటును భర్తీ చేస్తూ, దేశీయంగా సెమీ కండక్టర్ ప్యాకేజింగ్ సామర్థ్యాన్ని పెంపొందించటానికి ఈ కేంద్రం దోహదపడుతుంది. తద్వారా అత్యాధునిక సాంకేతిక తయారీ రంగంలో స్వావలంబన లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళుతుంది.

వావ్-థరాడ్‌లో పీఎం

రూ. 20,000 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేసి, ప్రారంభోత్సవాలను నిర్వహించి, జాతికి అంకితం చేయనున్నారు. ఇవి విద్యుత్, రైల్వే, రహదారి రవాణా, జాతీయ రహదారులు, ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, గిరిజనాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి వంటి కీలక రంగాలకు చెందిన ప్రాజెక్టులు.

రూ. 5,100 కోట్లకుపైగా వ్యయంతో నిర్మించిన, ప్రవేశ నియంత్రణ గల అహ్మదాబాద్-ధోలేరా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాంతీయ అనుసంధానతను మెరుగుపరచటంతో పాటు ధోలేరా ప్రత్యేక పెట్టుబడి ప్రాంతం (డీఎస్ఐఆర్)లో పారిశ్రామిక అభివృద్ధికి సహకరిస్తూ, ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుంది.

రహదారికి ఇరువైపులా పార్శ్వ మార్గాలతో కూడిన 4-లైన్ల ఇదార్-బదోలి బైపాస్ సెక్షన్ నిర్మాణానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఎన్‌హెచ్-754కే లోని ధోలవీర-మౌవాన-వావువ-సంతల్పూర్ సెక్షన్ (ప్యాకేజీ-ఎఎ)ను రెండు-లైన్ల రహదారికి ఇరువైపులా పార్శ్వ మార్గాలతో అభివృద్ధి చేసే పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులు హైవే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే కాక, ధోలవీర వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తాయి. రవాణా సామర్థ్యాన్ని పెంచి, ఆయా ప్రాంతాల సామాజిక- ఆర్థికాభివృద్ధికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.

కీలకమైన రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో గాంధీ నగర్-కోబా-ఎయిర్‌పోర్టు రోడ్డులోని భైజీపురా జంక్షన్ వద్ద నిర్మించనున్న ఫ్లైఓవర్ ఒకటి. ఇది ట్రాఫిక్ రద్దీని తగ్గించటమే కాక, ఫ్లైఓవర్ కింద సరైన పార్కింగ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తుంది. గాంధీనగర్-కోబా-అరోడ్రామ్ రోడ్డులోని పీడీపీయూ జంక్షన్ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. గాంధీనగర్ నుంచి విమానాశ్రయాన్ని కలిపే ఈ రహదారి గుండా రోజూ 1,40,000కుపైగా వాహన రాకపోకలు సాగుతుంటాయి. ఈ నూతన ఫ్లైఓవర్ నిర్మాణంతో అహ్మదాబాద్, గాంధీనగర్ మధ్య సీహెచ్-0 జంక్షన్ నుంచి విమానాశ్రయం వరకు ట్రాఫిక్ రద్దీ లేకుండా ప్రయాణం సాఫీగా సాగుతుంది.

సుమారు రూ.3,650 కోట్ల వ్యయంతో నిర్మించిన కీలక విద్యుత్ సరఫరా ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. వీటిలో ఖావ్డా పూలింగ్ స్టేషన్-2, 4.5 జీడబ్ల్యూ పునరుత్పాదక ఇంధన తరలింపునకు అనుబంధ సరఫరా వ్యవస్థలు ప్రధానమైనవి. ఈ ప్రాజెక్టులు పునరుత్పాదక ఇంధన అనుసంధానాన్ని పటిష్టం చేయటమే కాక, విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతాయి.

రైల్వే రంగానికి సంబంధించి కీలక ప్రాజెక్టులను ప్రధానమంత్రి జాతికి అంకితమిస్తారు. వీటిలో రాజ్‌కోట్-కనాలుస్ డబ్లింగ్ ప్రాజెక్టు (111.20 కి.మీ.)లో భాగంగా పూర్తి చేసిన కనాలుస్-జామ్‌నగర్ డబ్లింగ్ ప్రాజెక్టు (28 కి.మీ.), గాంధీధామ్-ఆదిపూర్ సెక్షన్ (10.69 కి.మీ.) నాలుగు లైన్ల విస్తరణ ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టుల వల్ల రైల్వే సామర్థ్యం పెరుగుతుంది. రద్దీ తగ్గుతుంది. కార్యకలాపాల సామర్థ్యం మెరుగుపడుతుంది. ప్రయాణికుల రాకపోకలు, సరకు రవాణాను మరింత వేగవంతం చేసేందుకు ఇవి సహకరిస్తాయి.

హిమ్మత్‌నగర్-ఖేడ్‌బ్రహ్మ మధ్య పూర్తయిన గేజ్ మార్పిడి ప్రాజెక్టును (54.83 కి.మీ) కూడా ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ప్రాంతంలో రైలు అనుసంధానాన్ని మెరుగుపరచటంతో పాటు ప్రయాణికుల రాకపోకలను ఇది సులభతరం చేస్తుంది. ఖేడ్‌బ్రహ్మ- హిమ్మతనగర్-అసర్వా రైలు సర్వీసును కూడా ఆయన ప్రారంభిస్తారు.

నగర మౌలిక సదుపాయాలను పెంపొందించటం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా గుజరాత్ వ్యాప్తంగా సుమారు రూ.5,300 కోట్ల విలువైన 44 పట్టణాభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. అహ్మదాబాద్‌లోని అసర్వా సివిల్ ఆస్పత్రిలో 858 పడకల రైన్ బసేరా, గాంధీనగర్ సివిల్ ఆస్పత్రి, జీఎంఈఆర్ఎస్ వైద్య కళాశాలలోనూ ఈ తరహా సదుపాయాన్ని ప్రారంభించడంతో పాటు వివిధ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

పర్యాటక అనుభూతిని మెరుగుపరచటం, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించటమే లక్ష్యంగా పటాన్‌లోని రాణి కీ వావ్ వద్ద లైట్ అండ్ సౌండ్ షో, వడ్‌నగర్‌లోని శర్మిష్ట సరసు వద్ద వాటర్ స్క్రీన్ ప్రాజెక్షన్ షో సహా పలు పర్యాటక ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. బనస్కాంతలోని బలరామ్ మహాదేవ్, విశ్వేశ్వర మహాదేవ్ ఆలయాల వద్ద పర్యాటక మౌలిక సదుపాయాల పనులకు శంకుస్థాపన చేస్తారు.

సుమారు రూ.1,780 కోట్ల విలువైన రెండు భారీ నీటి పైప్‌లైన్ ప్రాజెక్టులను ప్రధానమంత్రి జాతికి అంకితమిస్తారు. వీటిలో బనస్కాంతలోని కసారా-దంతివాడ పైప్‌లైన్.. పటాన్, బనస్కాంత జిల్లాల ద్వారా వెళ్లే దిండ్రోల్-ముక్తేశఅవర్ పైప్‌లైన్ ప్రాజెక్టులున్నాయి. అంబాజీ, దాని పరిసర గ్రామీణ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే పథకానికి కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ పథకం ద్వారా బనస్కాంత జిల్లాలోని దాంతా, అమీర్‌గఢ్ తాలూకాల్లోని సుమారు 1.5 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది. ఇది అంబాజీ పట్టణంతో పాటు 34 గ్రామాలకు తాగునీటిని అందిస్తుంది. సుమారు రూ.1000 కోట్ల పెట్టుబడి వ్యయంతో గాంధీనగర్‌లో చేపట్టనున్న మూడు సబర్మతీ రివర్‌ఫ్రంట్ విస్తరణ ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు.

అహ్మదాబాద్‌లోని వేజల్‌పూర్‌లో ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. గిరిజన విద్యార్థుల ఉన్నత చదువుల సౌకర్యార్థం దీన్ని నిర్మించారు.

# ఏపీ లో 528 కస్తూర్బా విద్యాలయాలలో అడ్మిషన్లు..

**-1.16 లక్షల మంది విద్యార్థినులకు ప్రవేశ అవకాశం**

**-స్బూర్బా విద్యాలయాలలో మౌలిక సదుపాయల కల్పన విషయంలో ఏపీ ప్రభుత్వ పనితీరు బేష్**

**-విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్రం సమాధానం**




అమరావతి, మార్చి 30: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 528 కస్తూర్బా విద్యాలయాల్లో అడ్మిషన్లకు అవకాశం ఉన్నట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 587 విద్యాలయాలు మంజూరు కాగా, ప్రస్తుతం 528 పాఠశాలలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఆయా విద్యాలయాల ద్వారా 1.16 లక్షల మంది విద్యార్థినిలకు ప్రవేశం కలగనుందని మంత్రి చెప్పారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్ సభలో కస్తూర్బా పాఠశాలల మంజూరు, మంజూరైన విద్యాలయాల్లో ఎన్ని అందుబాటులోకి వచ్చాయి విద్యార్థినిలకు ప్రవేశాలు, తదితర వివరాలు కోరుతూ అడిగిన ప్రశ్నకు మంత్రి జయంత్ చౌదరి సమాధానం ఇచ్చారు.

రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల బాలికలకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కెజిబివి) పనితీరుపై ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలను వెల్లడించింది. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల కోసం కేంద్రం భారీగా నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. 2021-22లో రూ. 329.80 కోట్లు కేటాయించగా , 2023-24లో రికార్డు స్థాయిలో రూ. 749.97 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 464.10 కోట్ల (46,410.07 లక్షలు) నిధులను ఆమోదించినట్లు వివరించారు ఈ నిధులను సమగ్ర శిక్ష పథకం కింద విడుదల చేస్తున్నట్లు స్పష్టం చేశారు .

రాష్ట్రంలోని 21 జిల్లాల్లో విస్తరించి ఉన్న ఈ విద్యాలయాల్లో మొత్తం 1,16,160 మంది విద్యార్థినులకు ప్రవేశం కల్పించే సామర్థ్యం ఉందని మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో గరిష్టంగా 51 పాఠశాలలు మంజూరు కాగా 48 అందుబాటులో ఉన్నాయన్నారు. నంద్యాల జిల్లాలో 47 మంజూరు కాగా 46 పని చేస్తున్నాయని, విజయనగరం జిల్లాలో 46 మంజూరు అయితే 43 పని చేస్తున్నట్లు వివరించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 46 మంజూరు కాగా 43 పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. కర్నూలు జిల్లాలో మంజూరైన 42 పాఠశాలలు అన్నీ ప్రస్తుతం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్ర ప్రభుత్వ పరంగా మంత్రి జయంత్ చౌదరి అభినందించారు.

విద్యాలయాల్లో విద్యుదీకరణ, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, అదనపు తరగతి గదులు, ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేస్తుండటం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఏపీలోని అన్ని కస్తూర్బా విద్యాలయాలు శాశ్వత భవనాల్లోనే నడుస్తున్నాయని, ఇది విద్యార్థినుల భద్రతకు భరోసానిచ్చే అంశం అన్నారు. దశలవారీగా 6-8 తరగతుల స్థాయి నుంచి 12వ తరగతి వరకు (ఇంటర్మీడియట్) కస్తూర్బా పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుందని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల (పీహెచ్‌సీ) కోసం అన్ని పాఠశాలల్లో ర్యాంపులు, ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడం వంటి సౌకర్యాలు కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. కేజీబివిలలో సౌకర్యాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే యాన్యువల్ వర్క్ ప్లాన్ ఆధారంగా ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు (పీఏబి) నిధులను కేటాయిస్తుందని, క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల ద్వారా విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తిని కాపాడుతున్నట్లు వివరంచారు.

# జాబ్‌మేళాతో 1,125 ఉద్యోగాలు

## యువతకు నైపుణ్యాలే కీలకం

అమరావతి, మార్చి 30:ఒక్కరికి ఉద్యోగం లభిస్తే ఆ కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ జాబ్‌మేళా ద్వారా 17 కంపెనీలలో మొత్తం 1,125 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

యువతీ, యువకులు తగిన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉద్యోగాలను సాధించా లన్నారు. ఉద్యోగం సాధించిన తర్వాత కూడా అదే సంస్థలో స్థిరంగా కొనసాగేందుకు అవసరమైన స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు.

ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళాలు నిర్వహిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.

# కనకదుర్గమ్మకు కానుకుల వర్షం..

**-ఇంద్రకీలాద్రిపై భక్తుల హుండీ కానుకలు వెల్లువ**

**-19 రోజుల్లో రూ.3.30 కోట్లకు పైగా ఆదాయం?**

**-రోజుకు సగటు రూ.17.42 లక్షలు.**

**-భారీగా వెండి బంగారం డాలర్లు విరాళం..**

అమరావతి,మార్చి 30:విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ కు భక్తులు పెద్ద



ఎత్తున కానుకల సమర్పించడంతో కానుకల వర్షం కురిసింది. ప్రతి రోజు వేల సంఖ్యలో వచ్చే భక్తులు అమ్మవారికి కానుకలను పెద్ద ఎత్తున సమర్పిస్తుండగా సోమవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో భారీ మొత్తంలో నగదు, బంగారం, వెండి సమర్పణలు నమోదయ్యాయి. మార్చి 11 నుంచి మార్చి 30 వరకు మొత్తం 19 రోజుల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయం లెక్కించగా, నగదు రూపంలో రూ.3,30,98,699 లభించింది. ఇందులో కరెన్సీ నోట్ల రూపంలో రూ.3,14,81,699, నాణేల రూపంలో రూ.16,17,000 నమోదయ్యాయి. రోజుకు సగటున రూ.17,42,036 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు.

# దేశాలతో సాంస్కృతిక, నాగరిక సంబంధాల బలోపేతం లక్ష్యంగా కార్యక్రమాలు

న్యూఢిల్లీ, మార్చి 30:సాంస్కృతిక ఒప్పందాలను కుదుర్చుకోవడం, సాంస్కృతిక ఆదానప్రధాన కార్యక్రమాలు, సాంస్కృతిక సహకారంపై అవగాహన ఒప్పందాలు మొదలైనవాటితోపాటు జీ20, బ్రిక్స్, ఎస్‌సీవో, సార్క్ వంటి బహుపాక్షిక సాంస్కృతిక వేదికలకు ఆతిథ్యమివ్వడం, వాటిలో భాగస్వామ్యం వహించడం ద్వారా... సాంస్కృతిక శాఖ భారతీయ కళలకు, సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పిస్తూ విదేశాలతో సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేస్తోంది. అంతర్జాతీయ భాగస్వామ్య పథకాన్ని కూడా నిర్వహించిన సాంస్కృతిక శాఖ.. దాని ద్వారా విదేశాల్లో భారతీయ పండుగలను నిర్వహించడంతోపాటు, భారత రాయబార కార్యాలయాల ద్వారా వివిధ దేశాల్లో ఉన్న భారత్ – విదేశీ మిత్ర సాంస్కృతిక సమాజాలకు గ్రాంట్లను అందిస్తోంది.

అంతేకాకుండా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని సంస్థ అయిన భారత సాంస్కృతిక సంబంధాల మండలి (ఐసీసీఆర్) కూడా సాంస్కృతిక కేంద్రాల ద్వారా విదేశాల్లో భారతీయ సంస్కృతికి ప్రాచుర్యం కల్పిస్తోంది.

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ 'జ్ఞాన భారతం' అనే జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించింది. రాతప్రతుల పునరావిష్కరణ, సంరక్షణ, డిజిటలీకరణలతోపాటు.. సజీవ వైజ్ఞానిక వనరులుగా భవిష్యత్ తరాలకు జాతీయ డిజిటల్ భాండాగారంలో వాటిని అందుబాటులో ఉంచడం కోసం దీన్ని ప్రారంభించారు. క్రమబద్ధమైన సర్వే – ప్రామాణీకరణ, వైజ్ఞానిక సంరక్షణ, డిజిటలీకరణ, ప్రచురణలతోపాటు జాతీయ డిజిటల్ భాండాగారాన్ని (నేషనల్ డిజిటల్ రిపోజిటరీ – ఎన్డీఆర్) ఏర్పాటు చేయడం ద్వారా.. దేశంలోని రాతప్రతుల పరంపరను సంరక్షించడం, పునరుజ్జీవింపజేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. పరిశోధన, విద్యా పరమైన ప్రయోజనాలతోపాటు ప్రజల భాగస్వామ్యం కోసం కూడా అవి అందుబాటులోకి వస్తాయి.

ఇతర దేశాలతో కలిసి ఉమ్మడి కార్యక్రమాలను ఐసీసీఆర్ నిర్వహిస్తుంది. విదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు/ సంబంధిత అధికారాలతో సంప్రదింపుల ద్వారా.. అక్కడి విశ్వవిద్యాలయాల్లో భారతీయ అధ్యయన పీఠాలను ఐసీసీఆర్ ఏర్పాటు చేస్తుంది. ఈ భారతీయ అధ్యయన పీఠాలు భారతీయ నాగరికత అధ్యయనంపై విదేశీ యువతను ప్రోత్సహించడంతోపాటు.. భారత సాంస్కృతిక వారసత్వం పట్ల లోతైన అవగాహనను కలిగిస్తాయి. అదేవిధంగా ప్రపంచ స్థాయి విద్యా, మేధోపరమైన, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఇవి కీలక పాత్ర పోషిసాయి. గత మూడేళ్లుగా వివిధ కళారూపాలకు చెందిన 210 సాంస్కృతిక బృందాలను ఐసీసీఆర్ పలు దేశాలకు పంపింది. ఏటా 192 దేశాలకు చెందిన విద్యార్థులకు యోగా, ఆయుర్వేదం సహా.. భారత్‌లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ స్థాయి చదువుల కోసం 21 పథకాల కింద 4000కు పైగా ఉపకార వేతనాలను ఐసీసీఆర్ మంజూరు చేస్తుంది.

రాతప్రతులు, ప్రాచీన పత్రాలు, అరుదైన పుస్తకాలు, ఆడియో–విజువల్ మెటీరియల్, చారిత్రక విలువ కలిగిన రికార్డులు సహా.. అంతర్జాతీయ ప్రాధాన్యమున్న లిఖిత ప్రతుల వారసత్వాన్ని సంరక్షించడం, ప్రోత్సహించడం 'యునెస్కో మెమరీ ఆఫ్ ది వరల్డ్ ప్రోగ్రామ్' లక్ష్యం. ఈ వారసత్వాన్ని కాపాడడంలో అంతర్జాతీయ సహకారాన్ని, ఉమ్మడి కృషి ని కూడా ఇది ప్రోత్సహిస్తుంది. మన భగవద్గీత, నాట్యశాస్త్రం వంటి గ్రంథాలు ఇటీవలే ఈ జాబితాలో చేరడం దీనికి నిదర్శనం.

పరస్పర అవగాహనను ప్రోత్సహించడానికి, ఇతర దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ సాంస్కృతిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడానికి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఐసీసీఆర్ చేపట్టిన కార్యక్రమాలు దోహదపడతాయి. లోక్‌సభలో ఇచ్చిన ఓ లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ ఈ సమాచారాన్ని అందించారు.

# సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధాన మంత్రి..

న్యూఢిల్లీ, మార్చి 30:స్వాతంత్ర్య యోధుల్లో మహనీయుడు శ్యామ్‌జీ కృష్ణ వర్మ జీవితం మనకు ధైర్య సాహసాలతో పాటు దృఢ సంకల్పానికి సంబంధించిన అసాధారణ స్ఫూర్తిని అందిస్తోందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. "ఇది దేశం పట్ల పౌరులు తమ కర్తవ్యాలను నెరవేర్చాలన్న భావనను కూడా అంకురింప చేస్తోంద"ని శ్రీ మోదీ అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి శ్రీ మోదీ పొందుపరుస్తూ –

"స్వాతంత్ర్య యోధులలో మహనీయుడైన శ్యామ్‌జీ కృష్ణ వర్మ జీవితం మనకు సాహసం, దృఢ సంకల్పాల అద్భుత ప్రేరణను అందిస్తోంది. ఇది దేశం పట్ల తమ కర్తవ్యాలను నిర్వహించాలనే భావనను ప్రజలలో అంకురింప చేస్తోంది.ప్రాప్యతే కిం యశః శుభ్రమనంగీకృత్య సాహసమ్" అని పేర్కొన్నారు.

# జీజీహెచ్‌లో అద్భుత శస్త్రచికిత్స..

### -ఏడు సంవత్సరాల బాలుడికి కొత్త జీవితం
### -అరుదైన 'నాసోఫారింజియల్ ఆంజియోఫైబ్రోమా'పై విజయం
### -వైద్యుల సమన్వయంతో ప్రాణాపాయం నుంచి రక్షణ



అమరావతి, మార్చి 30:గుంటూరుకు చెందిన 14 ఏళ్ల బాలుడు తిరుపతయ్య ఏడు సంవత్సరాలుగా అరుదైన జేఎన్ఏ (జువెనైల్ నాసోఫారింజియల్ ఆంజియోఫైబ్రోమా) వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ వచ్చాడు. ఈ వ్యాధి ప్రధానంగా కౌమార దశలో ఉన్న బాలురను ప్రభావితం చేస్తూ, ముక్కు వెనుక భాగంలో ఏర్పడి క్రమంగా ముఖ అంతర్భాగాలకు, కంటి మరియు మెదడు వైపు వ్యాపించే ప్రమాదకర స్వభావం కలిగి ఉంటుంది. తిరుపతయ్యకు ముక్కులో ఒక వైపు ఊపిరి ఆడకపోవడం, తీవ్రమైన రక్తస్రావం, ముఖ ఆకృతి మారిపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. దీని ప్రభావంతో అతను తీవ్ర మనస్తాపానికి గురై, ఆత్మవిశ్వాసం కోల్పోయి పాఠశాలకు వెళ్లడం కూడా మానివేశాడు. కూలి పనులు చేసే పేద కుటుంబానికి చెందిన ఈ బాలుడి తల్లిదండ్రులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సహా పలువురు ప్రైవేట్ వైద్యులను సంప్రదించగా, ఈ శస్త్రచికిత్సను హైదరాబాద్‌లో మాత్రమే చేయగలమని సూచించారు. అయితే అనంతరం విజయవాడలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ను ఆశ్రయించారు. ఇఎన్టి విభాగాధిపతి డాక్టర్ కొనిదె రవి నేతృత్వంలో వైద్య బృందం సవాల్‌గా స్వీకరించి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. మత్తు వైద్య బృందాధిపతి డాక్టర్ వినయ్, వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ రామరాజు, ఇఎన్టి అసోసియేట్ డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీనివాస్, పీజీ వైద్యులు డాక్టర్ ముకుందన్, డాక్టర్ మౌనికతో పాటు నర్సింగ్ సిబ్బంది సామ్రాజ్యం, సంధ్య సమన్వయంతో శస్త్రచికిత్స పూర్తిచేశారు. కంటి, మెదడు ప్రాంతాలకు విస్తరించిన ఈ ప్రమాదకర కణితిని అత్యంత జాగ్రత్తగా తొలగించి బాలుడిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ప్రస్తుతం బాలుడు కోలుకుంటూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. పేద కుటుంబానికి చెందిన బాలుడికి ఉచితంగా సేవలందించి కొత్త జీవితం ఇచ్చిన జీజీహెచ్ వైద్యులు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.

# రెన్యూవల్స్ గురించి భయపడొద్దు..

### -డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ శ్రీవాస్ నూపూర్ అజయ్ కుమార్



విజయవాడ, మార్చి 30: గత ఏడాది ఆథరైజేషన్ రెన్యువల్ విషయంలో జి ఎస్ డబ్ల్యూ ఎస్ వెబ్సైట్లో వచ్చిన ఎర్రర్ ను త్వరలో సరి చేస్తామని ఈ విషయంలో డీలర్లు ఎవరు భయపడాల్సిన పనిలేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల శేషగిరిరావు కార్యనిర్వాహక అధ్యక్షుడు శివప్రసాద్ సోమవారం రాష్ట్ర కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

2025 మార్చిలో రెండు సంవత్సరాలకి ఫీజు చెల్లించి సచివాలయంలో రెన్యువల్ కోసం దరఖాస్తు చేసిన వారిలో రాష్ట్రంలో 80 శాతం మంది డీలర్లకు 2027 వరకు రావలసిన అప్రూవల్ 2027 వరకే వచ్చిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. వీరందరికీ మరల 2027 వరకు ఆథరైజేషన్ రెన్యువల్స్ రీప్రింట్ ఇచ్చేలాగా ఆదేశాలు ఇప్పించాలని కోరారు. సమస్య తన దృష్టిలో ఉందని త్వరలో దానికి పరిష్కారం లభిస్తుందని తెలియజేశారు. అదేవిధంగా గత కొద్ది రోజులుగా ఎంఎల్ఎస్ పాయింట్లు డిస్పాచ్ అయిన తర్వాత డీలర్ కు స్టాక్ ఇచ్చే వేయింగ్ స్కేల్ వద్ద వెయిట్ లేకుండానే ఈపాస్ లో వచ్చేస్తుందని, ఇది అవకాశం తీసుకొని చాలా ఎమ్మెల్యేస్ పాయింట్లు స్టాకు తుకం లేకుండా డీలర్కి ఇచ్చేస్తున్నారు అని తెలియజేశారు. డీలర్ స్టాకు రిసీవ్ చేసుకున్న దగ్గర కూడా డిస్పాచ్ లో వచ్చేస్తుందని ఈ సమస్యని పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈపాస్ లో కొత్త వెర్షన్ 3.2 లో సరుకుల కోసం కార్డుదారులు వేలు ముద్ర వేయగానే పంచదార గోధుమపిండి ముందుగానే డేటా బేస్ లో వచ్చేస్తుందని బియ్యం మాత్రమే డీలరు ఎంటర్ చేయాల్సి వస్తుందని దీనివల్ల కార్డుదారుడికి పంచదార గోధుమపిండి అవసరం లేకపోయినా కూడా బిల్లు రావటం వల్ల ఆన్లైన్లో స్టాక్ కార్డుదారులకు ఇచ్చినట్టుగా కనబడుతుందని, కానీ ఆ స్టాక్ డీలర్ వద్ద ఉంటుందని అధికారులు తనిఖీ కొచ్చినప్పుడు డీలరు మీద కేసు నమోదు చేస్తారని ఈ ఇబ్బందులు సరి చేయమని కోరడం జరిగింది. ఈ రెండు సమస్యలను ఎన్ ఐ సి తో మాట్లాడి సరి చేపిస్తామని ఆవిడ హామీ ఇచ్చారు.

# శ్యామ్‌జీ కృష్ణ వర్మ వర్ధంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 30:భరత మాత వీర పుత్రుడు శ్యామ్‌జీ కృష్ణ వర్మ వర్ధంతి ఈ రోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. శ్యామ్‌జీ కృష్ణ వర్మ విప్లవాత్మక ఆలోచనలతో స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక కొత్త చైతన్యాన్ని అందించారని శ్రీ మోదీ అన్నారు. "ఆయన జీవితం, ఆయన ఆదర్శాలు దేశానికి సేవలను అందించే దిశగా ప్రతి ఒక్క తరానికీ స్ఫూర్తిని ఇస్తున్నాయ"ని శ్రీ మోదీ అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ఒక సందేశాన్ని ప్రధాన మంత్రి శ్రీ మోదీ పొందుపరుస్తూ –

"భరత మాత వీర పుత్రుడు శ్యామ్‌జీ కృష్ణ వర్మ పుణ్యతిథి సందర్భంగా ఆయనకు సాదర నమస్సులు. ఆయన విప్లవాత్మక ఆలోచనలతో స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక కొత్త చైతన్యాన్ని అందించారు. ఆయన జీవితం, ఆయన ఆదర్శాలు దేశానికి సేవలను అందించే దిశగా ప్రతి తరం వారికి స్ఫూర్తిని ఇస్తున్నాయ"ని పేర్కొన్నారు.

# పేదవాడి సొంతింటి కల సాకారం..

### -జిల్లాలో ఘనంగా గృహప్రవేశాలు.
### -పాల్గొన్న మంత్రి టీ.జీ. భరత్ .
### -లబ్ధిదారుల ఆనందోత్సాహం.



అమరావతి, మార్చి 30:పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 2.50 లక్షల గృహప్రవేశాల కార్యక్రమంలో భాగంగా సోమవారం కర్నూలు నగర పరిధిలోని జోహారాపురంలో నిర్వహించిన గృహప్రవేశ వేడుకలో మంత్రి పాల్గొన్నారు. నజీబున్నిసా బేగం, షేక్ గౌస్ బాషా నివాసంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి లబ్ధిదారులకు సంప్రదాయబద్ధంగా కొత్త బట్టలు బహూకరించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడిన మంత్రి, గతంలో అద్దె ఇళ్లలో ఎదురైన ఇబ్బందులను, ప్రస్తుతం సొంతింటి సంతోషాన్ని ఆరా తీశారు.

మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు అనేది ఒక భావోద్వేగమని, రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పేదలకు గృహ నిర్మాణాలను వేగవంతం చేస్తోందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పి ఎం ఏ వై) పథకం ద్వారా అర్హులకు రూ.2.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతున్నదని, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి 'పురసేవ' యాప్‌ను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఈ యాప్ ద్వారా నమోదు చేసిన ఫిర్యాదులు నేరుగా ముఖ్యమంత్రి డ్యాష్‌బోర్డుకు చేరుతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర..2047 లక్ష్యాల్లో భాగంగా ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ సంకల్పమన్నారు. జిల్లాలో ఇంకా 17 వేల మందికి ఇళ్ల స్థలాల అవసరం ఉందని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు.

పి ఎం ఏ వై 2.0 అర్బన్ పథకం కింద వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉండి సొంత స్థలం కలిగిన వారికి రూ.2.50 లక్షల సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2,600 ఇళ్లు మంజూరవగా, అందులో 1,000 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన పనులను అక్టోబర్‌లోపు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

పీఎం ఏవై గ్రామీణ పథకం కింద 30 వేల మంది అర్హులుగా గుర్తించబడగా, ఒక్కో యూనిట్‌కు రూ.2.39 లక్షల చొప్పున ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గతంలో పి ఎం ఏ వై 1.0 కింద మంజూరైన 53 వేల ఇళ్లలో 30 వేలు పూర్తయ్యాయని, మిగిలిన 20 వేలు ఇళ్లను సెప్టెంబర్ 2026లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. ఎస్సీ, బీసీ ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ.50వేల నుంచి రూ.70 వేల వరకు సాయం అందిస్తున్నామని తెలిపారు.

# ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026

న్యూఢిల్లీ, మార్చి 30: గతంలోని ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2016 స్థానంలో కొత్తగా 'ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026' చట్టాన్ని 27 జనవరి 2026న అధికారిక గెజిట్ ద్వారా కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ సవరించిన నిబంధనలు సర్క్యులర్ ఎకానమీ, విస్తరించిన ఉత్పత్తిదారుల బాధ్యత సూత్రాలను సమన్వయం చేస్తూ, వ్యర్థాల విభజన, సమర్థవంతమైన నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తాయి.

2026 ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం.. వ్యర్థాలను ఉత్పత్తి చేసే చోటే వాటిని తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, పారిశుద్ధ్య వ్యర్థాలు, ప్రత్యేక శ్రద్ధ అవసరమయ్యే వ్యర్థాలుగా నాలుగు రకాలుగా విభజించడం తప్పనిసరి. పెద్ద మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేసే వారిని స్పష్టంగా నిర్వచించడమే కాకుండా.. విస్తరించిన భారీ వ్యర్థాల ఉత్పత్తిదారు బాధ్యతను నెరవేర్చాలని ఈ నిబంధనలు నిర్దేశించాయి. దీనివల్ల వ్యర్థాల సేకరణ, రవాణా, శుద్ధి పర్యావరణ హితంగా జరుగుతుంది. ఘన వ్యర్థాల సేకరణ, రవాణా, శుద్ధి, పారవేసే ప్రక్రియలతో సహా ప్రతి దశను పర్యవేక్షించడానికి కేంద్రీకృత ఆన్‌లైన్ వేదికను ఏర్పాటు చేశారు.

ఈ నిబంధనలు పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలు, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు, భారత ప్రభుత్వంలోని సంబంధిత మంత్రిత్వ శాఖలకు నిర్దిష్ట పాత్రలు, బాధ్యతలను అందిస్తాయి. సిమెంట్ ప్లాంట్లు, వ్యర్థాల నుంచి శక్తిని ఉత్పత్తి చేసే కేంద్రాలతో సహా పారిశ్రామిక కేంద్రాల్లో వ్యర్థాల నుంచి తయారైన ఇంధనాన్ని (ఆర్ డీఎఫ్) వినియోగించడం ద్వారా ఇంధన ప్రత్యామ్నాయ రేటును ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి రాబోయే ఆరేళ్లలో 15 శాతానికి కి పెంచాలని ఈ నిబంధనలు వివరిస్తున్నాయి. ఘన వ్యర్థాల శుద్ధి, పారవేసే కేంద్రాల కోసం భూమి కేటాయింపును వేగవంతం చేయడానికి, అభివృద్ధి కోసం శ్రేణీకృత ప్రమాణాలను ఈ నిబంధనలలో పొందుపరిచారు. ఘన వ్యర్థాల శుద్ధి, పారవేసే కేంద్రాలు తమ నివేదికలను ఆన్‌లైన్‌లో సమర్పించడం తప్పని సరి చేశారు. ఈ నిబంధనల ప్రకారం వ్యర్థాల శుద్ధి కేంద్రాలు ఇకపై ఆడిటింగ్‌కు కూడా లోబడి ఉంటాయి.

పాతకాలం నాటి వ్యర్థాల పునరుద్ధరణ కోసం కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, అమలు చేయాలని, ఘన వ్యర్థాలను భూమిలో పూడ్చడంపై ఆంక్షలను మరింత పటిష్టం చేయాలని కూడా ఈ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కొండ ప్రాంతాలు, ద్వీపాలలో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక నిబంధనలను కూడా ఇందులో చేర్చారు. 'కాలుష్య కారకుడే చెల్లించాలి' అనే సూత్రం ఆధారంగా పర్యావరణ నష్టపరిహారం విధించేందుకు వీలుగా నిబంధనలను పొందుపరిచారు. ఈ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ఈ నియమాలు తెలుపుతున్నాయి. వీటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు కేంద్ర అమలు కమిటీని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఏర్పాటు చేసింది.

ఈ సమాచారాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ నేడు లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా అందించారు.

# గుజరాత్‌లోని పోరుబందరులో మాధవపూర్ మేళా సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 30: గుజరాత్‌లోని పోరుబందరులో జరుగుతున్న మాధవ్‌పూర్ మేళా సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉత్సాహభరితమైన వేడుక మన ఘనమైన సంస్కృతిని చాటిచెబుతుందనీ... గుజరాత్, ఈశాన్య రాష్ట్రాల మధ్య గల శాశ్వత సాంస్కృతిక బంధాన్ని మరింత బలపరుస్తుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. " 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, ఈ పండుగ విభిన్న సంప్రదాయాలను ఏకతాటిపైకి తీసుకువస్తుంది. ప్రజలందరూ ఈ మేళాను సందర్శించాలని నేను పిలుపునిస్తున్నాను!" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. 2022 ఏప్రిల్ నెలలో జరిగిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మాధవపూర్ మేళా ప్రాముఖ్యత, మన సంస్కృతిలో దాని విశిష్ట స్థానం గురించి ప్రధానమంత్రి మాట్లాడారు.

"గుజరాత్‌లోని పోరుబందరులో జరుగుతున్న మాధవపూర్ మేళా సందర్భంగా అందరికీ నా శుభాకాంక్షలు.

ఈ ఉత్సాహభరితమైన వేడుక మన ఘనమైన సంస్కృతిని చాటిచెప్పడంతో పాటు... గుజరాత్, ఈశాన్య ప్రాంతాల మధ్య గల శాశ్వత సాంస్కృతిక బంధాన్ని మరింత బలపరుస్తుంది.

ఈ పండుగ 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, విభిన్న సంప్రదాయాలను ఏకతాటిపైకి తీసుకువస్తుంది. ప్రజలందరూ ఈ మేళాను సందర్శించాలని నేను పిలుపునిస్తున్నాను!

ఏప్రిల్ 2022 నాటి మన్ కీ బాత్ కార్యక్రమంలో నేను మాధవపూర్ మేళా ప్రాముఖ్యత, మన సంస్కృతిలో దాని విశిష్టత గురించి మాట్లాడాను. తప్పకుండా వినండి?"

# గుజరాత్‌లోని పోరుబందరులో మాధవపూర్ మేళా సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 30:గుజరాత్‌లోని పోరుబందరులో జరుగుతున్న మాధవ్‌పూర్ మేళా సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉత్సాహభరితమైన వేడుక మన ఘనమైన సంస్కృతిని చాటిచెబుతుందనీ... గుజరాత్, ఈశాన్య రాష్ట్రాల మధ్య గల శాశ్వత సాంస్కృతిక బంధాన్ని మరింత బలపరుస్తుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. " 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, ఈ పండుగ విభిన్న సంప్రదాయాలను ఏకతాటిపైకి తీసుకువస్తుంది. ప్రజలందరూ ఈ మేళాను సందర్శించాలని నేను పిలుపునిస్తున్నాను!" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

2022 ఏప్రిల్ నెలలో జరిగిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మాధవపూర్ మేళా ప్రాముఖ్యత, మన సంస్కృతిలో దాని విశిష్ట స్థానం గురించి ప్రధానమంత్రి మాట్లాడారు.

"గుజరాత్‌లోని పోరబంబదరులో జరుగుతున్న మాధవపూర్ మేళా సందర్భంగా అందరికీ నా శుభాకాంక్షలు.

ఈ ఉత్సాహభరితమైన వేడుక మన ఘనమైన సంస్కృతిని చాటిచెప్పడంతో పాటు... గుజరాత్, ఈశాన్య ప్రాంతాల మధ్య గల శాశ్వత సాంస్కృతిక బంధాన్ని మరింత బలపరుస్తుంది.

# పోగొట్టుకున్న మొబైల్‌ను గుర్తించి బాధితురాలికి అప్పగింత..

వరంగల్, మార్చి 30:సిర్పూర్ (యు) మండలానికి చెందిన ఓ మహిళ తన మొబైల్ ఫోన్ నూ లింగాపూర్ జగదాంబ దేవి మహా జాతర సమయంలో పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై గంగన్న ఆధ్వర్యంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ నూ ట్రాక్ చేసి పట్టుకొని సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితురాలకు అప్పగించారు.

ఈ సందర్భంగా ఎస్సై గంగన్న మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకోవడం లేదా అపహరించడం లాంటిది జరుగుతే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సులభంగా గుర్తించి తిరిగి మొబైల్ ఫోను పొందవచ్చున్నారు.. ఎవరైనా సెల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లయితే సీఈఐఆర్ పోర్టల్ లో వివరాలు నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోను తిరిగి అప్పగించినందుకు పోలీస్ లకు బాధితురాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గృహ.. వాణిజ్య.. హాస్టల్.. మెస్.. క్యాంటీన్ విభాగాలకు

# ఈ నెలలో 2.9 లక్షలకు పైగా కనెక్షన్ల దాకా గ్యాస్ సరఫరా

న్యూఢిల్లీ, మార్చి 30:పశ్చిమాసియాలో అనూహ్యంగా మారిపోతున్న పరిస్థితుల నేపథ్యంలో కీలక రంగాల్లో స్థిరత్వానికి భరోసా ఇస్తూ కేంద్ర ప్రభుత్వ నిరంతర పర్యవేక్షణతో సన్నద్ధత సహా ప్రతిస్పందనాత్మక చర్యలు చేపడుతోంది. నిరంతరాయ ఇంధన సరఫరా, సముద్ర కార్యకలాపాల నిశిత పరిశీలన, పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతాల్లోని భారత పౌరులకు అవసరమైన సహాయంపైనా దృష్టి కేంద్రీకరించింది. ఆయా రంగాల్లో ఈ నెల 29 వరకూ తీసుకున్న చర్యలపై తాజా సమాచారం కిందివిధంగా ఉంది:

### విద్యుత్ సరఫరా.. ఇంధన లభ్యత

హోర్ముజ్ జలసంధి మూసివేత దృష్ట్యా దేశవ్యాప్తంగా 'ఎల్‌పీజీ' సహా పెట్రోలియం ఉత్పత్తుల నిరంతరాయ సరఫరా దిశగా ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితి ఇలా ఉంది:

### ముడిచమురు.. శుద్ధి కర్మాగారాలు

దేశంలో ముడిచమురు నిల్వలు తగినంతగా ఉండటంతోపాటు చమురుశుద్ధి కర్మాగారాలన్నీ అదనపు సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. తదనుగుణంగా దేశమంతటా పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా తగినంతగా అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోంది.

జాతీయ వినియోగానికి కొరత లేకుండా శుద్ధి కర్మాగారాలలో దేశీయంగానే 'ఎల్‌పీజి' ఉత్పత్తిని పెంచింది.

### చిల్లర విక్రయ కేంద్రాలు

దేశవ్యాప్తంగా అన్ని చిల్లర విక్రయ కేంద్రాలు సాధారణ స్థితిలోనే పనిచేస్తున్నాయి.

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు ?10 వంతున కేంద్ర ప్రభుత్వం తగ్గించింది.

అలాగే, దేశీయ మార్కెట్లో ఈ ఉత్పత్తుల లభ్యతకు భరోసా ఇస్తూ డీజిల్‌పై లీటరుకు ?21.50, విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై లీటరుకు 29.50 వంతున ప్రభుత్వం ఎగుమతి సుంకం విధించింది.

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఇంధన లభ్యతపై భయాందోళనతో కొనుగోళ్లు సాగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని రాష్ట్రాల్లో వదంతుల ఫలితంగా కొన్ని చిల్లర విక్రయ కేంద్రాల్లో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో విపరీతమైన రద్దీతోపాటు అసాధారణ.. అధిక అమ్మకాలు సాగినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే, దేశంలోని అన్ని పెట్రోల్ పంపులలో పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంతగా లభ్యమవుతున్నాయిన ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ నేపథ్యంలో తప్పుదోవ పట్టించే సమాచారాన్ని, వదంతులను నమ్మవద్దని ప్రభుత్వం మరోసారి ప్రజలకు సూచించింది.

### సహజ వాయువు

'డీ-పీఎన్‌జీ', 'సీఎన్‌జీ' రవాణాలో 100 శాతం సరఫరాతో వినియోగదారులకు ప్రాధాన్యం.

గ్రిడ్ అనుసంధానిత పారిశ్రామిక-వాణిజ్య వినియోగదారులకు వారి సగటు వినియోగంలో 80 శాతం సరఫరా అవుతోంది.

వాణిజ్య 'ఎల్‌పీజీ' లభ్యతపై ఆందోళన పరిష్కారం దిశగా 'పీఎన్‌జీ' కనెక్షన్లు ఇవ్వడంలో తమ పరిధిలోని అన్ని భౌగోళిక ప్రాంతాల్లోగల రెస్టారెంట్లు, హోటళ్లు, క్యాంటీన్ల వంటి వాణిజ్య సంస్థలకు ప్రాధాన్యమివ్వాలని 'సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్' (సీజీడీ) సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది.

యూరియా కర్మాగారాలకు గత 6 నెలల సగటు వినియోగంలో సుమారు 70-75 శాతం మేర ప్రస్తుతం సరఫరా స్థిరంగా ఉంది. దీంతోపాటు సరఫరా, పైప్‌లైన్ హైడ్రాలిక్స్ ప్రక్రియల నిర్వహణ కోసం అదనంగా 'ఎల్ఎన్‌జీ', 'రీగ్యాసిఫైడ్ ఎల్ఎన్‌జీ' (ఆర్ఎల్ఎన్‌జీ) కూడా అందుతుంది.

ఎరువుల కర్మాగారాలు సహా పారిశ్రామిక వినియోగ దారులందరూ తమ అదనపు అవసరాన్ని తక్షణ ప్రాతిపదికన తెలియజేయాలని ప్రభుత్వం సూచించింది. తద్వారా గ్యాస్ మార్కెటింగ్ కంపెనీల ద్వారా దాన్ని సమకూరుస్తారని తెలిపింది.

ఈ నేపథ్యంలో గృహ, వాణిజ్య 'పీఎన్‌జీ' కనెక్షన్లు తీసుకునే వారికి 'ఐజీఎల్', 'ఎంజీఎల్', 'జీఎఐఎల్' గ్యాస్, 'బీపీసీఎల్' వంటి 'సీజీడీ' కంపెనీలు ప్రోత్సాహకాలిచ్చాయి.

'సీజీడీ' నెట్‌వర్క్ విస్తరణ దిశగా దరఖాస్తుల ఆమోదం ప్రక్రియను వేగిరపరచాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలతోపాటు తన మంత్రిత్వ శాఖలను కేంద్ర ప్రభుత్వం కోరింది.

'ఎల్‌పీజీ' దీర్ఘకాలికంగా 'పీఎన్‌జీ' వినియోగానికి మళ్లడంలో రాష్ట్రాలు తోడ్పాటునిస్తే అదనంగా 10 శాతం మేర వాణిజ్య 'ఎల్‌పీజీ' కేటాయింపు ఉంటుందని కేంద్ర ప్రభుత్వం 18.03.2026 నాటి ఆదేశం ద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు వెసులుబాటు కల్పించింది. అలాగే, 'సీజీడీ' నెట్‌వర్క్ విస్తరణను ప్రోత్సహించే సంస్కరణల దిశగా చర్యలు చేపట్టిన వివిధ రాష్ట్రాల నుంచి 'పీఎన్‌జీ' మంత్రిత్వశాఖ దరఖాస్తులు స్వీకరించింది. దీనికి అనుగుణంగా కొన్ని రాష్ట్రాలకు అదనపు కేటాయింపులుపై సిఫారసు చేసింది.

మరోవైపు నవిూపంలో పైప్‌లైన్ మౌలిక సదుపాయాలు ఉన్నచోట ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, సామాజిక వంటశాలలు, అంగన్‌వాడీ వంటశాలలు తదితరాలను 5 రోజుల్లోగా 'పీఎన్‌జీ'తో అనుసంధానించేలా 'సీజీడీ' సంస్థలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని 'పీఎన్‌జీఆర్‌బీ' 23.03.2026 నాటి ఉత్తర్వు ద్వారా ఆదేశించింది.

అలాగే, "తగ్గించిన కాలవ్యవధితో 'సీజీడీ' మౌలిక సదుపాయాల కల్పన దిశగా సత్వర ఆమోద చట్రాన్ని" 3 నెలల పాటు ఒక ప్రత్యేక ప్రక్రియగా చేపట్టినట్లు రోడ్డు రవాణా-రహదారుల మంత్రిత్వ శాఖ 24.03.2026 నాటి ఉత్తర్వులో తెలిపింది. దీని ప్రకారం 'సీజీడీ' మౌలిక సదుపాయాల కల్పన సంబంధిత దరఖాస్తులను ప్రాధాన్యం ప్రాతిపదికన పరిశీలిస్తారు.

నిత్యావసర వస్తువుల చట్టం-1955 కింద సహజ వాయువు, పెట్రోలియం ఉత్పత్తుల పంపిణీ (పైప్‌లైన్లు తదితర సౌకర్యాల కల్పన, నిర్మాణం, నిర్వహణ, విస్తరణ) ఉత్తర్వు-2026ను కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం, 24.03.2026 నాటి గెజిట్ ప్రకటన ద్వారా జారీచేసింది. తద్వారా దేశవ్యాప్తంగా పైప్‌లైన్ల నిర్మాణం, విస్తరణకు ఓ క్రమబద్ధ, వ్యవధి నిర్దేశిత చట్రం అమలవుతుంది. ఆయా పనులకు ఆమోదం-అనుమతులు సహా భూ సేకరణలో జాప్యాల నివారణ సహా నివాస ప్రాంతాలతోపాటు సహజ వాయువు మౌలిక సదుపాయాల సత్వర నిర్మాణానికి ఇది వీలు కల్పిస్తుంది. దీనివల్ల 'పీఎన్‌జీ' నెట్‌వర్క్ విస్తరణ వేగిరం కావడమేగాక చివరి అంచె సంధానం మెరుగుపడి, కాలుష్య రహిత ఇంధన వినియోగం వైపు మళ్లే వెసులుబాటు కల్పిస్తుందని ప్రభుత్వం భావిసోంది. దీంతో ఇంధన భద్రత బలోపేతమై భారత గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథంలో సాగుతుందని ఆశాభావంతో ఉంది.

రక్షణ మంత్రిత్వశాఖ 27.03.2026న జారీచేసిన ఒక ఉత్తర్వులో- అన్ని నివాస ప్రాంతాలు, రక్షణ యూనిట్ లైన్లలో 'పీఎన్‌జీ' మౌలిక సదుపాయాల కల్పనను వేగిరపరచే దిశగా 2026 జూన్ 30 దాకా అమలయ్యే స్వల్పకాలిక విధాన సవరణను ప్రకటించింది.

ఈ నెలలో గృహ, వాణిజ్య, హాస్టల్, మెస్, క్యాంటీన్ తదితరాలు సహా 2.9 లక్షలకు పైగా కనెక్షన్లకు గ్యాస్ సరఫరా కొనసాగుతోంది.

వాణిజ్య వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పాక్షిక (20 శాతం) వాణిజ్య 'ఎల్‌పీజీ' సరఫరాను పునరుద్ధరించింది. అలాగే, 'పీఎన్‌జీ' విస్తరణ కోసం వ్యాపార సౌలభ్య సంస్కరణల ప్రాతిపదికన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా 10 శాతం వాణిజ్య వంటగ్యాస్ కేటాయిస్తామని 18.03.2026 నాటి ఆదేశాల ద్వారా ప్రకటించింది.

దీంతోపాటు 21.03.2026 నాటి ఆదేశాల ద్వారా రాష్ట్రాలకు మరో 20 శాతం వాణిజ్య 'ఎల్‌పీజీ' కేటాయింపును అనుమతించింది. దీంతో మొత్తం కేటాయింపు ('పీఎన్‌జీ' విస్తరణ కోసం వాణిజ్య సౌలభ్య సంస్కరణల ఆధారంగా 10 శాతం సహా) 50 శాతానికి చేరుతుంది. ఈ 20 శాతం అదనపు కేటాయింపును రెస్టారెంట్లు, ధాబాలు, హోటళ్లు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఆహార తయారీ, పాడి పరిశ్రమ సహా రాష్ట్ర ప్రభుత్వ లేదా స్థానిక సంస్థలు నిర్వహించే రాయితీ క్యాంటీన్లు, విక్రయ కేంద్రాలు, సామాజిక వంటశాలలు, వలస కార్మికులకు 5 కిలోల 'ఎఫ్‌టీఎల్' వంటి వాటి సరఫరాకు ప్రాధాన్యం ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది.

కేంద్ర ప్రభుత్వం 27.03.2026న జారీచేసిన ఆదేశాల ప్రకారం- వాణిజ్య వంటగ్యాస్ కోసం అదనంగా 20 శాతం కేటాయించాలని (దీనివల్ల సంస్కరణల ఆధారిత 10 శాతంతో కలిపి మొత్తం వాణిజ్య కేటాయింపు సంక్షోభానికి ముందు స్థాయిలోని 70 శాతానికి చేరుతుంది) నిర్ణయించింది. ఈ అదనపు 20 శాతాన్ని ఉక్కు, ఆటోమొబైల్, వస్త్ర, రంగులు, రసాయనాలు, ప్లాస్టిక్స్ పరిశ్రమలకు ప్రాధాన్యం ప్రాతిపదికన సరఫరా చేస్తుంది. ఇందులో తయారీ పరిశ్రమలకు లేదా సహజ వాయువుకు ప్రత్యామ్నాయం లేని ప్రత్యేక తాప ప్రయోజనాల నిమిత్తం 'ఎల్‌జీజీ' అవసరమయ్యే పరిశ్రమలకు ప్రాధాన్యం ఉంటుంది.

దేశవ్యాప్తంగా నిన్న 5 కిలోల సిలిండర్లు సుమారు 64,000 అమ్ముడయ్యాయి.

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గృహేతర 'ఎల్‌పీజీ' కేటాయింపు దిశగా 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉత్తర్వులు జారీ చేశాయి. మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య వంటగ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్నాయి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మొత్తంమీద 2026 మార్చి 14 నుంచి వాణిజ్య సంస్థల ద్వారా 39368 టన్నుల గ్యాస్‌ను తరలించారు.

అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సాధారణ కేటాయింపులతోపాటు అదనంగా 48,000 కిలో లీటర్ల కిరోసిన్‌ను కేటాయించాం.

కిరోసిన్ పంపిణీ చేయాల్సిన ప్రాంతాలను గుర్తించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరాం.

ఇప్పటికే 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కిరోసిన్ కేటాయింపు ఉత్తర్వులను జారీ చేశాయి. హిమాచల్ ప్రదేశ్, లడఖ్ తమ రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో కిరోసిన్ అవసరం లేదని తెలియజేశాయి.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పాత్ర

అత్యవర వస్తువుల చట్టం 1955, ఎల్‌పీజీ నియంత్రణ ఉత్తర్వు 2000 ప్రకారం అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేసే వారిపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. పెట్రోలు, డీజిలు, ఎల్‌పీజీ వంటి నిత్యావసర వస్తువుల సరఫరా పరిస్థితిని పర్యవేక్షించడంలో, నియంత్రించడంలో రాష్ట్ర,కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. భారత ప్రభుత్వం ఇప్పటికే పలు లేఖలు, వీడియో కాన్ఫరెన్సుల ద్వారా ఇదే విషయాన్ని అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు వెల్లడించింది.

అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులు, అదనపు ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, ఆహార, పౌర సరఫరాల శాఖ కార్యదర్శులను ఈ కింది చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాం.

సరైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, వదంతులను అరికట్టడానికి ప్రతిరోజూ విలేకరుల సమావేశాలు నిర్వహించాలని, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో ఎప్పటికప్పుడూ సమాచారం అందించాలని భారత ప్రభుత్వం 27 మార్చి 2026 తేదీ నాటి లేఖ ద్వారా అన్ని రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులను మరోసారి కోరింది. ప్రస్తుతం 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రతిరోజూ పత్రికా సమావేశాలు నిర్వహిస్తున్నాయి.

ఎల్‌పీజీ అక్రమ నిల్వలు, సరఫరాను అరికట్టడానికి అనేక రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో దాడులు కొనసాగుతున్నాయి. నిన్నటి వరకు సుమారు 2900 దాడులు నిర్వహించగా.. దాదాపు 1000 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

సరఫరా సజావుగా సాగేలా చూడటానికి, అక్రమ నిల్వలు/ రవాణా కేసులను తనిఖీ చేయడానికి ప్రభుత్వ రంగ చమురు సంస్థల అధికారులు నిన్న దేశవ్యాప్తంగా 1200 కుపైగా పెట్రోల్ బంకులు, ఎల్‌పీజీ పంపిణీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఎల్‌పీజీ పంపిణీ కేంద్రాలకు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇప్పటివరకు సుమారు 480 షోకాజు నోటీసులు జారీ చేశాయి. యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ ప్రభుత్వం గృహ వినియోగ ఎల్‌పీజీ, పీఎన్‌జీ సరఫరాతోపాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలకు కూడా అధిక ప్రాధాన్యతనిస్తోంది.

సరఫరా, డిమాండ్ రెండింటినీ సమన్వయం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలను అమలు చేసింది. ఇందులో భాగంగా రిఫైనరీ ఉత్పత్తిని పెంచడం, గ్యాస్ సిలిండర్ బుకింగ్ వ్యవధిని పట్టణ

# గృహ ప్రవేశం చేయించిన కలెక్టర్, ఎమ్మెల్యే..

**-జిల్లాలో 1112 గృహాలకు రూ.13.22 కోట్లు మంజూరు**

**-జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

శ్రీకాకుళం,మార్చి 30: జిల్లాలో 1112 గృహాలకు రూ. 13.22 కోట్లు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శ్రీకాకుళం పట్టణంలోని 44వ వార్డులో ప్రధాన మంత్రి ఆవాస యోజన 2.0 కింద మంజూరైన గృహాన్ని సోమవారం స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ తో కలసి కలెక్టర్ లబ్ధిదారుని చేత గృహ ప్రవేశం చేయించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఇల్లు మీ పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాదిగా, మీ కుటుంబానికి భద్రతగా ఉండాలని, మీ జీవితాల్లో ఆనం దం, ఆత్మవిశ్వాసం, అభివృద్ధి తీసుకురావాలని ఆశిస్తున్నట్లు లబ్ధిదారునికి చెప్పారు. పిఎంఎవై గ్రామీణ్ పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుండి ఏప్రిల్ నెలలో నిధులు వస్తాయని, లబ్దిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో 1112 గృహాలకు 13. 22 కోట్లు ఖర్చు అయ్యిందన్నారు. పూర్తి అయిన గృహాలు నియోజక వర్గాల వారీగా చూస్తే ఆమదాలవలస నియోజకవర్గం లో 106, ఎచ్చెర్ల నియోజకవర్గంలో 112, ఇచ్ఛాపురం నియో జకవర్గంలో 151, నరసన్నపేట నరసన్నపేట నియోజకవర్గంలో 55, పలాస నియోజకవర్గంలో 163, పాతపట్నం నియోజక వర్గంలో 201, గృహాలు పూర్తి చేసినట్లు చెప్పారు.

# కాకతీయ యూనివర్సిటీ బడ్జెట్ రూ.331.99 కోట్లు.. ప్రతిపాదించిన వీసీ ప్రతాప్‌రెడ్డి




హనుమకొండ మార్చి 30 : కాకతీయ విశ్వవిద్యాలయం 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.331.99 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించింది. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన విశ్వవిద్యాలయ సెనెట్‌హాల్‌లో జరిగిన 41వ అకాడమిక్ సెనెట్ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి వి.రామచంద్రం, అకాడమిక్ సెనె ట్ సభ్యుల సమక్షంలో విశ్వవి ద్యాలయ అర్థశాస్త్ర విభాగ ఆచా ర్యులు, సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ విభా గాల డీన్, దూరవిద్యాకేంద్ర సంచాలకులు, పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్‌లాల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సంవత్స రం పాటు ఉద్యోగుల వేతనాలు, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్‌లు, ఉద్యోగ విరమణ భత్యాలు, నిర్వహణ ఖర్చులు, పరీక్షలు, అభివృద్ధి కార్యక్రమా లకు, ఇతర ఖర్చులకు రూ.355.90 కోట్లు కేటాయించారు.మొత్తం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వ నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ. 205. 47 కోట్లు కాగా ఇతర వనరులు నుంచి రూ.126.52 కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. వీటిలో ఉన్నత విద్యామండలి నుంచి సెమినార్‌ల నిమిత్తం రూ.10 లక్షలు, ఇతరాల నుంచి రూ.15.50 లక్షలు, అకాడమిక్, ట్యూషన్ ఫీజుల రూపంలో రూ.8.33 కోట్లు, అంతర్గత వనరులు ద్వారా రూ.41.41 కోట్లు, ఇతర పద్దుల ద్వారా 21.56 కోట్లు, పరీక్షల విభాగం నుంచి రూ.49.64 కోట్లు ముఖ్యంగా ఉన్నాయి. ఖర్చులను, రాబడులను సురేష్‌లాల్ 8 అంశాల్లో చూపించారు. అదే సమయంలో రూ.2.16 కోట్లు లోటు ఉంటుందని వెల్లడించారు. ఉద్యోగుల జీతాలకు, పెన్షన్‌లకు రూ.169.96 కోట్లు, నిర్వహణ కార్యక్రమాలకు రూ.10.34 కోట్లు, పరీక్షలకు రూ.54.88 కోట్లు, అకాడమిక్ కార్యక్రమాలకు రూ.13.68 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.97.44 కోట్లు, అప్పులు ఇతరాలకు రూ.1.75 కోట్లు, కరువు భత్యానికి రూ.8.40 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు.

వీసీ ప్రతాప్‌రెడ్డి విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అందరి కృషి ఉందని, బాధ్యతతో విశ్వవిద్యాలయాని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. 2026లో విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ సంవత్సరంలోనికి అడుగు పెట్టిందని, ఆ సందర్భంగా అకాడమిక్ కార్యక్రమాలు (గోల్డెన్ జూబ్లీలో భాగంగా) జరుగుతున్నాయని చెప్పారు. నూతన కోర్స్?లు జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా తీసుకోని వస్తామని, విద్యార్థులను ఉద్యోగార్థులుగా చేయటవే లక్ష్యంగా, సిలబస్ రూపకల్పన, కృత్రిమమేధా, క్వాంటం టెక్నాలజీ పొందుపరుస్తున్నట్లు, డొమైన్ విజ్ఞానంతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌పై దృష్టి పెడుతున్నట్లు, క్రెడిట్ పాలసీలను కుడా అందుబాటులో తెస్తున్నట్లు, ముఖగుర్తింపు కూడా విభాగాలలో విద్యార్థులకు, హాస్టల్‌లో మెస్కు కూడా తీసుకోని వస్తున్నట్లు, విద్యార్థులు మానసిక స్థితికి తోడుగా 'చేతనా' అనే సెంటర్‌ను నెలకొల్పినట్లు, లైబ్రరీకి నిధులు పెంచుతున్నట్లు తెలిపారు.

అనంతరం స్టాండింగ్ కమిటీ అఫ్ అకాడమిక్ సెనెట్‌ను, వార్షిక నివేదికలను సభ ఏకగ్రీవంగా ఆవెూదించింది. ఈ సమావేశంలో పాలక మండలి సభ్యులతో పాటు ప్రొఫెసర్లు కట్ల రాజేందర్, ఎస్.ప్రసాద్, ఎం.సదానందం, ప్రిన్సిపాళ్లు టి.మనోహర్, జ.కృష్ణవేణి, ఎన్.రమణ, కే.భిక్షాలు, ఎస్.జ్యోతి, భాస్కర్, నల్లాని శ్రీనివాస్, గోపి, బి.ఎస్.ఎల్.సోజన్య, అకాడమిక్ సెనెట్ సభ్యులు గొల్లపూడి జగదీశ్, మాణిక్యం, ఫైనాన్సు ఆఫీసర్ మహమ్మద్ హబీబుద్దిన్, లింగంపల్లి రాము, సీ హెచ్.ప్రణయకుమార్, ఆర్.శ్రీలతదేవితో పాటు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అవగాహన పెంపొందించటం, జీవనశైలి మార్పులపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సందేశాన్ని ప్రతిబింబించే పుస్తకం: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మార్చి 30: సాధారణ ఊబకాయం కన్నా పొట్ట భాగంలో కొవ్వు పేరుకుపోవటం అత్యంత ప్రమాదకరమని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూవిజ్ఞాన శాస్త్ర శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష విభాగాల సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ముఖ్యంగా భారతీయుల్లో సన్నగా కనిపించే వ్యక్తుల్లోనూ అంతర్గత అవయవాల చుట్టూ కొవ్వు పేరుకుపోయే అవకాశం ఎక్కువగా ఉందని హెచ్చరించారు. ఊబకాయంతో సంబంధం లేకుండా కేవలం పొట్ట దగ్గర పెరిగే కొవ్వు ఆరోగ్యానికి ప్రమాదంగా మారుతుందని తెలిపారు.

"సీవీడీలో స్థూలకాయం, లిపిడ్ నిర్వహణలో పురోగతులు" సమగ్ర పాఠ్య పుస్తకాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొట్ట దగ్గర పేరుకుపోయే కొవ్వు, లావుగా కనిపించని వ్యక్తుల్లోనూ జీర్ణక్రియ సంబంధిత సమస్యలకు దారితీస్తుందన్నారు. దీనివల్ల మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, ఫ్యాటీ లివర్, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదముందని చెప్పారు.

భారతీయుల శరీరతత్వం గురించి ప్రస్తావిస్తూ.. పురుషులు, మహిళల్లోనూ ఊబకాయం పెరుగుతున్నప్పటికీ, పొట్ట వద్ద కొవ్వు పేరుకుపోవటం అత్యంత ఆందోళకరమని మంత్రి అన్నారు. ఇది ఇతర సమస్యలతో సంబంధం లేకుండా గుండె, జీర్ణక్రియ వ్యాధుల ముప్పును పెంచుతుందని చెప్పారు. సాధారణంగా ఊబకాయులు కావప్పటికీ, కేవలం పొట్ట భాగంలో మాత్రమే కొవ్వు పేరుకుపోవటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని.. ఈ పరిస్థితిని ముందుగానే గుర్తించి చికిత్స, నివారణా చర్యలు చేపట్టటం అవసరమని స్పష్టం చేశారు.

సకాలంలో, సందర్భోచితంగా ఈ పుస్తకం ఉన్నట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. దేశంలో పెరిగిపోతున్న ఊబకాయం సమస్యను పరిష్కరించాలన్న జాతీయ ప్రాధాన్యతకు అనుగుణంగా ఉందని పేర్కొన్నారు. నూనె వాడకాన్ని తగ్గించటం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లలో మార్పులు వంటి జీవనశైలి సంస్కరణలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన ట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమం "వికసిత భారత్, స్వస్థ భారత్, ఊబకాయ రహిత భారత్" విస్తృత దార్శనికతకు అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు.

పెరుగుతున్న వైద్య అవగాహన గురించి వివరిస్తూ.. ఫ్యాటీ లివర్, ఇన్సులిన్ నిరోధకత, చిన్న వయసులోనే గుండె సంబంధిత వ్యాధుల బారిన పడటానికి, పొట్ట భాగంలోని కొవ్వుకు సంబంధాలున్నట్లు ఆధారాలున్నాయని మంత్రి తెలిపారు. యువతలో టైప్-2 డయాబెటిస్, గుండె పోటు, జీర్ణక్రియ సంబంధిత వ్యాధులు పెరగటం.. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవటాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు.

సమతుల్య ఆరోగ్య పద్ధతుల ప్రాముఖ్యతను డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. తగినంత సన్నద్ధత లేదా విశ్రాంతి లేకుండా చేసే వ్యాయామాల వంటి అశాస్త్రీయ ఫిట్‌నెస్ విధానాలు ఆరోగ్యానికి ముప్పు కలిగిసాయన్నారు. స్థిరమైన జీవనశైలి క్రమశిక్షణ, తగినంత నిద్ర, శాస్త్రీయ పద్ధతుల్లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవటం అవసరమని చెప్పారు.ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ హెచ్.కె. చోప్రా సంపాదకత్వంలో వెలువడిన ఈ పాఠ్య పుస్తకం.. భారత్, విదేశాలకు చెందిన 300 మందికి పైగా రచయితల నుంచి అత్యాధునిక పరిశోధనల సమాహారం. ఇది జీర్ణక్రియ చికిత్సలు, లిపిడ్ నిర్వహణ, డిజిటల్ ఆరోగ్యం, ఏఐ ఆధారిత వైద్య నిర్ణయ వ్యవస్థల్లోని పురోగతులను సమన్వయం చేస్తూ.. సాంప్రదాయ ప్రమాద కారక ఆధారిత నిర్వహణ నుంచి కచ్చితమైన నివారణ వైపు మార్పును సూచిస్తుంది.

సెమాగ్లుటైడ్, టిర్జెపటైడ్ వంటి జీఎల్‌పీ-1 రిసెప్టర్ అగోనిస్ట్‌లతో అభివృద్ధి చెందుతున్న చికిత్సలను ఈ పుస్తకం సమగ్రంగా వివరిస్తుంది. వీటితో పాటు స్టాటిన్లు, ఎజెటిమిబ్, బెంపెడోయిక్ యాసిడ్, పీసీఎస్‌కే9 ఇన్‌హిబిటర్లు, ఇంక్లిసిరాన్, అఫెరిసిస్, జన్యుపరమైన పరిష్కారాలతో లిపిడ్‌ను తగ్గించే వ్యూహాలు ఇందులో ఉన్నాయి. ఈ పురోగతులు గుండె సంబంధిత ఫలితాలను మెరుగుపరిచి, వ్యాధి ప్రభావాన్ని తగ్గించే అవకాశముంది. భారత్‌లో, ప్రపంచవ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులు, మరణాలు పెరగటానికి ఊబకాయం, రక్తంలో కొలెస్ట్రాల్ పెరగటం వంటి ప్రధాన ఆరోగ్య సవాళ్లు ఈ పుస్తక పీఠికలో ఉన్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

# ప్రజావాణికి 50 అర్జీలు



సంగారెడ్డి, మార్చి 30 (నేటి నిజం ప్రతినిధి)ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి,పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి కలెక్టర్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి అర్జికి ప్రాధాన్యత నిచ్చి సంబంధిత శాఖల అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలన్నారు.

ప్రజావాణిలో రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, పంచాయతి, వ్యవసాయ, మహిళా శిశు సంక్షేమం, బీసీ అభివృద్ధి శాఖలు, నీటి పారుదల, ట్రాన్స్పోర్ట్, అనిమల్ హస్బెండ్రి, మున్సిపాలిటీలు, ఉపాధి తదితర శాఖలకు సంబంధించి 50 అర్జీలు అందాయి.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన న్యూటన్

## మార్చి 31... సైన్స్ పితామహుడు సర్ ఐజాక్ న్యూటన్ వర్ధంతి

**అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభా శాలి, అంతటి ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయననూ ఆయనలాంటి వారినీ ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు.**

మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన "సర్ ఐజాక్ న్యూటన్" ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఈయన ఓ సిద్ధాంత కర్త మరియు తత్వవేత్త కూడా. ప్రకృతిసిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం అంతా ఆయనను "సైన్సు పితామహుడు"గా కీర్తించింది.

ప్రపంచంలోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళ్తున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం.

విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్‌కు దగ్గర్లోగల ఉల్‌తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు.

న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవాడు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారంలాంటివి కూడా ఆయన తయారు చేశాడు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో ఉన్నాయి.

1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నాడు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించాడు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.



భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించాడు.

గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించాడు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించాడు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపాడు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలిగిపోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది.

విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్‌స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలినవాడు ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమితులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి

**1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నాడు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించాడు.**

మొదటి సూత్రము

"బాహ్యబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటుంది". ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు.

రెండవ సూత్రము

"ఒక వస్తువు ద్రవ్యవేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది

న్యూటన్ మూడవ నియమం

చర్యకు ప్రతి చర్య సమనంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును.

భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ "ప్రిన్సిపియా మేథమేటికా" అనే గ్రంథాన్ని రచించాడు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా "దృశాశాస్త్రం" పుట్టింది.

మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించాడు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపాడు.

ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను భౌతిక శాస్త్ర పితామహుడు అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం "సర్" అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటినుంచి ఐజాక్ న్యూటన్ కాస్తా సర్ ఐజాక్ న్యూటన్‌గా మారిపోయారు.

ఆ తరువాత కూడా ఎన్నో మైలురాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 31, 1727న మరణించారు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# ఉపాధ్యాయిని బండారు సునీతకు 'శ్రీకరి' ఉగాది పురస్కారం



పాల మూరు మార్చి 29:అమరచింత మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా సేవలందిస్తున్న ప్రముఖ కవయిత్రి బండారు సునీతకు ప్రతిష్టాత్మకమైన శ్రీకరి ఫౌండేషన్ ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం పాలమూరు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూనే, సామాజిక చైతన్యం కోసం కథలు, కవితలు మరియు ఉత్తమ ఆర్టికల్స్ రాస్తున్న ఆమె కృషిని గుర్తించి ఫౌండేషన్ ఈ గౌరవాన్ని అందించింది. ఈ పురస్కార ప్రధానోత్సవంలో హిందూ ధర్మ సంఘ వ్యవస్థాపకులు చిక్కోటి ప్రవీణ్ కుమార్, శ్రీకరి ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ మెట్టుగాడి శ్యాంసుందర్, ప్రవల్లిక, శ్రీనివాస్, టీటీడీ కోఆర్డినేటర్ రామాచారి మరియు స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బండారు సునీతకు ఉగాది పురస్కారం దక్కడం పట్ల అమరచింత మండల ఉపాధ్యాయులు, స్థానిక కవులు మరియు మేధావులు హర్షం వ్యక్తం చేశారు. సమాజ హితం కోసం ఆమె చేస్తున్న సాహిత్య సేవ మరెందరికో స్ఫూర్తిదాయకమని పలువురు ఈ సందర్భంగా కొనియాడారు.

# 14 వార్డు ప్రాథమిక పాఠశాలలో పలు కార్యక్రమాలు

## -ఉత్తమ ఉపాధ్యాయునికి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించిన కౌన్సిలర్ తుము మధు



వేములవాడ, మార్చి 30: వేములవాడ పట్టణంలోని 14వ వార్డు ప్రాథమిక పాఠశాలలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. గురుకుల పాఠశాలలో సీట్లు సాధించిన 5వ తరగతి విద్యార్థులు మోతే సాయి వర్ధన్, తోట సుశాంత్, వేల్పుల సృజనలను వార్డు కౌన్సిలర్ తుము మధు ఘనంగా సత్కరించారు. ఇడ్లీ డే సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఇడ్లీ వడ్డించి, దక్షిణ భారతీయ ఆహారమైన ఇడ్లీ యొక్క పోషక విలువలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణకి ఉగాది పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు లభించినందుకు సన్మానం నిర్వహించారు. అంగన్వాడి చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధూమ్ మధు, ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, వార్డు ఆఫీసర్ పరశురాములు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఈడుగు లక్ష్మి, యదులపురపు సప్న, ఆర్పి గోడిసెల రేణుకతో పాటు వార్డు మహిళలు పాల్గొన్నారు.

# ఎంజీయూలో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయాలని ఏబీవీపీ ధర్నా

నల్గొండ, మార్చి 30: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో జరుగుతున్న నిర్మాణ పనుల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ హనుమాన్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా యూనివర్సిటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, ముఖ్యంగా రోడ్ల మలుపుల వద్ద కంకర, రాళ్లు, డస్ట్ పేరుకుపోవడంతో వాహనాలు జారి పడుతున్నట్లు తెలిపారు. దుమ్ము అధికంగా లేవడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నాలుగు రోజుల క్రితం ఏఈ ఆఫీస్ ముందు ధర్నా చేసినప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం దురదృష్టకరం అన్నారు. ఈ నిర్లక్ష్యం వల్లే ఆదివారం ఇద్దరు విద్యార్థులు బైక్‌పై వెళ్తూ జారి పడ్డట్లు వెల్లడించారు. విద్యార్థుల సమస్యలను సీరియస్‌గా తీసుకోకపోవడం యాజమాన్య వైఫల్యమని అన్నారు. దీనికి నిరసనగా విద్యార్థుల భద్రత దృష్ట్యా నిర్మాణ పనులను తాత్కాలికంగా ఆపివేశామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సంపత్, అజయ్, సుధీర్, సతీష్, విజయ్, వెంకటేష్, నందు, సాయి తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఆది శీనన్న సేవలు శ్లాఘనీయం

## సీనియర్ కరాటే మాస్టర్ ఎం.ఏ మన్నాన్.



రాజన్న సిరిసిల్ల, మార్చి 30: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆ అకాడమీలో కరాటే శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు ఆ అకాడమీకి కొన్ని సంవత్సరాలుగా సహాయ సహకారాలు అందిస్తూ కరాటే రంగాన్ని ఎన్నో రకాలుగా ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ 35 వ వార్షికోత్సవం సందర్భంగా అకాడమీ డిస్ట్రిక్ట్ చీఫ్, సీనియర్ కరాటే మాస్టర్,సీనియర్ జర్నలిస్ట్ ఎం.ఏ మన్నాన్ తన బ్లాక్ బెల్ట్ శిష్య బృందంతో కలిసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆది శీనన్న రాజకీయ రంగం లో అగ్ర స్థానం నిలిచి అన్ని వర్గాల ప్రజలకు తన అండదండలు అందిస్తున్నారని ఎనలేని సేవలు చేస్తున్నారని అన్నారు.అదేవిధంగా వారి సహాయ సహకారాలు విద్యార్థుల కరాటే రంగ అభివృద్ధికి వారి యొక్క భవిష్యత్ జీవితానికి ఎంతో ప్రయోజనకరమని మాస్టర్ మన్నాన్ అన్నారు.కరాటే అకాడమీకి విద్యార్థుల భవిష్యత్తుకు ఎల్లవేళలా ఆది శీనన్న సహాయ సహకారాలు ఇలాగే కొనసాగాలని వారు పేర్కొంటూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు ఇప్పపుల అజయ్, తోట రాజు, కొండ శేఖర్, అన్నారం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, అసిస్టెంట్ పీపీ, బ్లాక్ బెల్ట్ అవధూత రజినీకాంత్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వసంత్ కుమార్, కాంగ్రెస్ నాయకులు చిలుక రమేష్, సీనియర్ బ్లాక్ బెల్ట్ గ్రహీతలు రాచకొండ విజయ్, తిరుపతి, దండగుల దేవరాజు, లోలోపు రాజు, శంకర్, కనికరపు రాజశేఖర్, మాన్య తిరుపతి, కావ్య, అబ్దుల్ ఫర్హాన్ అబ్బా సి, సూర్య జై చందర్, తదితరులు ఉన్నారు .

# అంగన్వాడి స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## -రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్

కరీంనగర్, మార్చి 30:(నేటనిజం ప్రతినిధి) అంగన్వాడీ స్కూల్ లలో అందే సేవలను వినియోగించుకోవాలని కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్ సూచించారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లో భాగంగా కోతిరాంపూర్ అంగన్వాడీ సెంటర్లో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆర్డీవో మహేశ్వర్ జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సిడిపిఓ సబితా , 39 డివిజన్ కార్పొరేటర్ లుమాసం గణేష్, కార్పొరేటర్ పాడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్యలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్కు దీటుగా అంగన్వాడీ స్కూల్ లు గొప్పగా పనిచేస్తున్నాయని, ఆట పాటలతో విద్య ను బోధించడం జరుగుతుందని చెప్పారు. డి డబ్ల్యు ఓ సరస్వతి మాట్లాడుతూ గర్భవతులు , బాలింతలు అంగన్వాడీ సెంటర్ లో లభించే పౌష్టికహారం బాలామృతం తీసుకోవాలని సూచించారు సీడీపీఓ సబితా మాట్లాడుతూ ప్రీ స్కూల్ ప్రాధాన్యత, మొదటి 1000 రోజుల లో



తీసుకోవాల్సిన జాగ్రత్త, పోషకహారం గురుంచి తల్లులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు .పి డ జి ప్రతం మాస్టర్ ట్రయినర్ రాజేందర్ పిల్లలకు ఐదు అభివృద్ధి ల పైన ఆటలు ఆడించారు. దాదాపు 200 మంది పిల్లలు ఆటలు, పాటలు, కథ, సంభాషణ, పూర్వ గణిత భావనలు తల్లి తండ్రులను మంత్ర ముగ్దులను చేసాయి. భాష, మేధా, సాంఘిక అభివృద్ధి, సృజనత్మాకత గురించి పిల్లలకు వివరిస్తూ వారికీ రిపోర్ట్ కార్డు సీడీపీఓ సబితా సూపెర్వైసోర్ అరుణ నిర్మల రేణుక చేతుల మీద అందించడం జరిగింది. ప్రీస్కూల్ వస్తువుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది ఈ కార్యక్రమం లో బి సి సతీష్ ,టీచర్స్ స్వరూప శ్యామల, సరిత ,పిల్లలు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగూర్ నుంచి 0.3 టీఎంసీల నీరు విడుదల చేయాలి : మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి

మెదక్, మార్చి 30: సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆయకట్టు పంటను కాపాడేందుకు 0.3 టీఎంసీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పాపన్నపేట మండలం చిత్రియాల గ్రామ శివారులో పంటపొలాలను పార్టీ మండల నాయకులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి సంవత్సరం రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేసి రెండు పంటలు పండించే అవకాశం కల్పించారని తెలిపారు. ఘనపూర్ ఆయకట్ట పరిధిలో ఎఫ్‌ఎం, ఎఫ్ఎన్ కాలువల ద్వారా మూడు మండలాలకు సాగునీరు అందుతూ రైతులు పుష్కలంగా పంటలు పండించుకునేవారని చెప్పారు.

పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నదని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ఈ సీజన్‌లో సింగూర్ నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు.రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించకపోవడం, నష్టపరిహారం ఇవ్వకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సాపురం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. పంటలు పొట్టదశలో ఉన్నందున వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తా రోకోలు చేపడతామని హెచ్చరించారుఆమె వెంట చిత్రియల్ సర్పంచ్ సురేష్, పాపన్నపేట్ మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ బాల గౌడ్, మాజీ రైతుబంధు అధ్యక్షులు సోములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు కొత్తపల్లి జగన్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, బద్రి, మల్లేశం శ్రీనాథ్ రావు, నాయకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ఆరు లక్షలు లంచం తీసుకుంటూ.. పట్టుబడిన జీఎస్టీ టాప్ అధికారి

బెంగళూరు: జీఎస్టీ కేసు మాఫీ కోసం వాణిజ్య పన్నుల ఉన్నతాధికారి పది లక్షలు లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.6 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ లంచం డబ్బు తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు ట్రాప్ చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) డిప్యూటీ కమిషనర్‌గా 48 ఏళ్ల భరత్ కుమార్ హెగ్డే పని చేస్తున్నాడు. రూ.60 లక్షల జీఎస్టీ ఎగవేసినట్లు ఆరోపిస్తూ 53 ఏళ్ల విశ్వజీత్ నాయక్‌కు నోటీస్ జారీ చేశాడు.

కాగా, జీఎస్టీ అధికారి భరత్ కుమార్ హెగ్డేను విశ్వజీత్ నాయక్ కలిశాడు.

తనకు జారీ చేసిన నోటీస్ గురించి అడగ్గా పది లక్షల లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.6 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని విశ్వజీత్ నాయక్ లోకాయుక్తను ఆశ్రయించాడు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com